# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

బుధవారం 10 డిసెంబరు 2025




## రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బుచ్చిరెడ్డిపాళెంలోని సెయింట్ మేరీస్ కళాశాలలో 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్ 14 బాల బాలికల ఫెన్సింగ్ క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసరావు తదితరులు ఈ పోటీలను ప్రారంభించారు. 11వతేదీ వరకు జరిగే పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 300 మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు, మేనేజర్లు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటాపోటీగా క్రీడాకారులు తలపడ్డారు. ఈ పోటీలలో ఎస్‌జీఎఫ్‌ఐ నాయకులు భీమతాటి రమణయ్య, ఎం.దేవిక, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి గురుప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాసులు, టోర్నమెంట్ పరిశీలకులు భవాని, బుచ్చి, మర్రిపాడు ఎంఈఓలు దిలీప్‌కుమార్, పీవీ రత్నం, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి, పక్కన ఎస్పీ అజితా వేజెండ్ల

## ఏ స్టేషన్‌లో ఏం జరుగుతోంది!?

- జిల్లాలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆరా
- పలు స్టేషన్లలో విస్తృత తనిఖీలు
- నిర్లక్ష్యంగా ఉంటే సహించనని హెచ్చరిక
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం

8



కలువాయిలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న స్థానికులు

## మీ ఆవేదనను సీఎం దృష్టికి తీసుకెళతా!

- జేఏసీ నాయకులతో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల
- కలువాయిలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

8

## ‘సోమశిల’కు 11,588 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 11,588 క్యూసెక్కుల వరద వస్తోంది. డ్యాంలో 73.638 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 6,650, కండలేరుకు 2,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● కండలేరు డ్యాంలో..

**రాపూరు :** కండలేరు డ్యాంలో 60.32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1550 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 1050 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నట్లు పేర్కొన్నారు.

పదో తారీఖు వచ్చినా

# జీతాలేవి సార్!



నెల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడో ఒకటో తేదీ అందాల్సిన జీతాలు ఇప్పుడు పదో తారీఖు వచ్చినా అందలేదు. కొన్ని ప్రభుత్వ విభాగాలలోని ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయగా, ప్రధానమైన ఇంజనీరింగ్ వంటి శాఖలకు ఎదురుచూపులు తప్పడం లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ నెల జీతాల చెల్లింపులో ఆలస్యమైనట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం ప్రతీ నెలా ఒకటి, రెండు తేదీల్లోనే వేతనాలను జమచేస్తూ వస్తోంది. కానీ డిసెంబరులో పరిస్థితులు భిన్నంగా మారాయి. నిధుల కొరతతో కొన్ని శాఖలకు మాత్రమే ఒకటో తేదీన జీతాలు పడ్డాయి. అందులో రెవెన్యూ, పోలీసు, మెడికల్ వంటి ప్రధానమైన శాఖలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 20 వేల మంది వరకూ ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వారిలో సుమారు 15 వేల మంది వరకూ వేతనాలు అందుకున్నట్లు ట్రెజరీ వర్గాలు చెబుతున్నాయి. మరో 5 వేల మందికి వేతనాలు అందాల్సి ఉందని అంటున్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ వంటి ఇంజనీరింగ్ శాఖలు ఈ జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు వ్యవసాయ శాఖ, అన్ని శాఖల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అలానే ఇంకొన్ని శాఖల్లో కొందరికి వేతనాలు అందగా, మరికొందరికి అందలేదు. ఉద్యోగ సంఘాల సమాచారం ప్రకారం ఒకటి, రెండు రోజుల్లో మిగిలిన ఉద్యోగులందరికీ జీతాలు పడనున్నట్లు తెలిసింది. కాగా నెలలో పది రోజులు గడిచినా వేతనాలు అందకపోవడంతో చిన్న స్థాయి ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో చాలా మందికి నెలవారీ ఈఎంఐలు ఉండడం ప్రధాన సమస్యగా మారింది.

- ఉద్యోగులకు పూర్తిస్థాయిలో అందని వేతనాలు
- జాబితాలో ఇంజనీరింగ్ శాఖలన్నీ
- అవుట్‌సోర్సింగ్, పలు శాఖల ఉద్యోగుల ఎదురుచూపులు

## ‘దిత్వా’ నష్టం.. లెక్క తేలింది!

జిల్లాను అతలాకుతలం చేసిన దిత్వా తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ లెక్కగట్టింది. మొత్తం 21 మండలాల్లోని 215 గ్రామాల్లో 20,059 మంది రైతులకు చెందిన 4739.6 హెక్టార్లలో వరితోపాటు వేరుశనగ, మొక్కజొన్న, పొగాకు, మినుము, శనగ పంటలు నీటమునిగాయి. అదేవిధంగా 2175 హెక్టార్లలో నర్సరీలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక పంపింది. 4095.6 హెక్టార్లలో వరిపైరు, 68 హెక్టార్లలో మొక్కజొన్న, 86 హెక్టార్లలో మినుము, 28 హెక్టార్లలో శనగ, 112 హెక్టార్లలో వేరుశనగ, 350 హెక్టార్లలో పొగాకు పంటలు నష్టపోయాయి.

- 4,739 హెక్టార్లలో నీటమునిగిన పంటలు
- 2,175 హెక్టార్లలో నర్సరీలు
- 4095 హెక్టార్లలో దెబ్బతిన్న వరిపైరు
- 80 శాతం సబ్సిడీతో వరి విత్తనాల పంపిణీ

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను కారణంగా జిల్లాలో అత్యధికంగా 1350 హెక్టార్లలో వరిపైరు దెబ్బతిన్నది. అంతేగాక 214 హెక్టార్లలో నర్సరీలు పాడయ్యాయి. అత్యధికంగా వెంకటాచలం మండలంలో 400 హెక్టార్లలో వరి నర్సరీ దెబ్బతింది. విడవలూరులో 525 హెక్టార్లు, కావలిలో 360 హెక్టార్లు, నెల్లూరు రూరల్‌లో 350 హెక్టార్లు, తోటపల్లిగూడూరులో 298 హెక్టార్లు, ముత్తుకూరులో 250 హెక్టార్లు, బుచ్చిరెడ్డిపాళెంలో 230 హెక్టార్లు ఇంకా అనంతసాగరం, కోవూరు, అల్లూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, సంగం, రాపూరు తదితర మండలాల్లో వరిపైరు దెబ్బతింది.



మనుబోలు ప్రాంతంలో నీటమునిగిన వరినాట్లు (ఫైల్)

### మంత్రితో మాట్లాడిన సోమిరెడ్డి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడితో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. తుఫాను కారణంగా రైతులు బాగా నష్టపోయారని, విత్తనాలు అందించి ఆదుకోవాలని కోరారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి, ప్రతి రైతుకు 80శాతం సబ్సిడీపై విత్తనాలు అందించేలా ఆదేశాలు జారీ చేశారు.

● **80శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ**

తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులకు 80శాతం సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు మంగళవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దెబ్బతిన్న పంటల వివరాలతోపాటు విత్తనాల అవసరంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. అవసరమైన రైతులకు వెంటనే 80శాతం సబ్సిడీపై విత్తనాలను అందించాలని ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో అత్యధికంగా నష్టపోయిన మనుబోలు, వెంకటాచలం మండలాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ పై విత్తనాలను పంపిణీ చేశారు. దాదాపుగా 14940.5 క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్-15048, కేఎన్‌ఎం-1638 రకాల వరి విత్తనాలతోపాటు టీసీజీఎస్-1694 రకం వేరుశనగ విత్తనాలు 150 క్వింటాళ్ల అవసరమని వ్యవసాయ శాఖ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. వెంకటాచలం, మనుబోలు మండలాల్లో వెయ్యి క్వింటాళ్ల వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని మిగిలిన మండలాల్లో సైతం రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు.



## గ్రామీణ రోడ్లకు మహర్దశ

- అభివృద్ధికి నిధుల మంజూరు
- జిల్లాలో 39 రోడ్లు.. 155 కి.మీ, రూ.76 కోట్లు
- పరిపాలనా అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం
- త్వరలో టెండర్లు పిలవనున్న పీఆర్ అధికారులు

నెల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. గ్రామాల కనెక్టివిటీలో కీలకమైన పంచాయతీరాజ్ రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ రూరల్ రోడ్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రవ్యాప్తంగా 1299 రోడ్లను రూ.2122.97 కోట్లతో 4006 కి.మీ మేర అభివృద్ధి చేసేందుకు తీర్మానించారు. ఇందుకు సంబంధించిన పరిపాలన అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జారీ చేసింది. అందులో జిల్లాకు సంబంధించి 399 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. రూ.76.34 కోట్లతో 155.42 కి.మీ మేర పీఆర్ రోడ్లను బాగు చేయనున్నారు. త్వరలోనే సాంకేతిక అనుమతులు మంజూరు కానుండగా, ఆ వెంటనే టెండర్లు పిలవనున్నారు. రాబోయే రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను పూర్తిగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

● **అభివృద్ధి చేయనున్న రోడ్లు ఇవే..**

గాంధీగిరిజన సంఘం-సంగం వయా పల్లిపాలెం రోడ్డు, ముంబయి రోడ్డు-చాబోలు రోడ్డు, బోడిపాడు - ఓబులాయపల్లి- ఆదూరుపల్లి రోడ్డు, పీఎస్ రోడ్డు - నాగులవెల్లటూరు, వీసీ రోడ్డు - పెరుమాళ్లపాడు రోడ్డు, ఏఎస్ రోడ్డు - వెంగంపల్లి వయా మహిమలూరు రోడ్డు, ఆత్మకూరు అప్పారావు పాలెం - కనుపూరుపల్లి వయా మురగళ్ల రోడ్డు, చంద్రపడియ-దూబగుంట రోడ్డు, పోకూరు-కేపీ ఎన్ రోడ్డు వయా ఎస్‌ఎన్ పల్లి, ఎంసీ రోడ్డు - పొట్లూరు వయా వీరేపల్లి రోడ్డు, గుడ్లూరు-నరస రాపురం వయా మొగ ళ్లూరు రోడ్డు, కేజీటీ రోడ్డు - బీమవరం రోడ్డు, తెట్టు - రామాయపట్నం రోడ్డు, అన్నగారి పాలెం క్రాస్ - అన్నగారిపాలెం వయా నడింపల్లి రోడ్డు, మబ్బు గుంట పాలెం బ్రాంచ్ రోడ్డు, ఎంసీ రోడ్డు - సాంబ శివాపురం రోడ్డు, బీజీవీ కండ్రిగ రోడ్డు - వైఎస్‌పురం రోడ్డు, తాళ్లూరు క్రాస్ - తాళ్లూరు రోడ్డు, ఇందుకూరు-పురిణి వయా కొత్తపాలెం రోడ్డు, ముదివర్తి ఆర్‌అండ్‌బీ రోడ్డు - జమ్మిపాలెం రోడ్డు, ఎంసీ రోడ్డు - ఇనమడుగు వయా పడుగుపాడు రోడ్డు, గండవరం-పీయలపాలెం రోడ్డు, బుచ్చి సున్నపుబట్టి రోడ్డు - వవ్వేరు రోడ్డు, ఎన్‌హెచ్67 - చెయ్యలపాలెం వయా చిన్నతోపు రోడ్డు, ఎన్‌హెచ్67- వవ్వేరు రోడ్డు, ఎన్‌టీ రోడ్డు - కొండ్లపూడి రోడ్డు, అప్రోచ్ రోడ్డు - వెల్లంటి ఎస్సీ కాలనీ రోడ్డు, ఎంసీ రోడ్డు - పూడిపర్తి వయా రామదాసుకండ్రిగ రోడ్డు, కాకుపల్లి చెరుకూరు రోడ్డు- చింతారెడ్డిపాలెం రోడ్డు, చెన్నపల్లిపాలెం - కొత్తపాలెం రోడ్డు, పేడూరు-చింతోపు రోడ్డు, ముత్తుకూరు -

- మిగతా 7వ పేజీలో

## నెల్లూరులో మరో మూడు స్మార్టు బజార్లు

● రూ.8 కోట్లతో ఏర్పాటుకు రంగం సిద్ధం

నెల్లూరు (సిటీ), డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - మైపాడు రహదారిలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ బజారు తరహాలో మరో మూడు ప్రాంతాలలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కార్పొరేషన్ అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకుగాను మేరకు రూ.8 కోట్లు ఖర్చు చేయనున్నారు. నగరంలోని సర్వేపల్లి కాలువ ఆనుకుని, రైల్వే స్టేషన్ ఎదుట, శెట్టిగుంటరోడ్డు తదితర ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మైపాడు రహదారి వెంబడి అందుబాటులోకి తెచ్చినవి సఫలీకృతం కావడంతో మరింత మంది మహిళలకు దుకాణాలు కేటాయించి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ స్మార్ట్ బజార్లను ఏర్పాటు చేయనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తవగానే మెప్మా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి దుకాణాలు కేటాయించనున్నారు.

## రూ.530 కోట్లతో పెన్నా పొర్లుకట్టల నిర్మాణం



పొర్లుకట్టను పరిశీలిస్తున్న ఎస్ఈ దేశినాయక్

● జలవనరుల శాఖ ఎస్ఈ దేశినాయక్

సంగం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పెన్నా నదికి రెండువైపులా దెబ్బతిన్న పొర్లుకట్టల నిర్మాణాలకు సుమారు రూ.530 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ ఎస్ఈ దేశినాయక్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన సంగం బ్యారేజికి తూర్పు, ఎడమవైపు దెబ్బతిన్న పొర్లుకట్టను ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. పెన్నా నదికి వచ్చే వరదల వల్ల ఎడమవైపు పొర్లుకట్ట కోతకు గురై ప్రమాదకరంగా ఉందని స్థానిక రైతులు ఇటీవల ఫిర్యాదు చేయడంతో పరిశీలన చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సంగం బ్యారేజ్ నిర్వాహకులు పొర్లుకట్టల నిర్మాణానికి రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపారని, అవి మంజూరుకాకపోతే ఇరిగేషన్ ఆధ్వర్యంలో ప్రతి పాదనలు పంపుతామని తెలిపారు. ఇటీవల వచ్చిన రెండు వరుస తుఫాన్‌లకు చెరువుల్లో 22 టీఎంసీల నీళ్లు చేరాయని తెలిపారు. ఇరిగేషన్ పరిధిలో పనిచేసే లస్కర్లకు రెండు సీజన్ల 9 నెలల జీతాలు రావాల్సి ఉంది వచ్చిన వెంటనే అందచేస్తామన్నారు. ఆయన వెంట డీఈ పెంచలయ్య, తహసీల్దారు సోమ్లా నాయక్, ఏఈ వినయ్ ఉన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో రహదారి సమస్య పరిష్కారం

కొడవలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గ్రామస్తుల రహదారి సమస్యకు పరిష్కారం చూపారు. దాసరిపాలెం నుంచి యల్లాయపాలెం వెళ్లే రహదారి గుంతలుపడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మ, తక్షణమే అధికారులను ఆదేశించి రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి లెవలింగ్ చేయించి సమస్యను పరిష్కరించారు. ఇక్కడ త్వరలోనే సీసీ రోడ్డు పడనుంది. సీసీ రోడ్డు పూర్తయితే ప్రజలకు శాశ్వత రవాణా సౌకర్యం ఏర్పడనుంది.

**బంగారం, వెండి ధరలు**



| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ. 12283 |
| వెండి కిలో ధర | రూ. 184500 |
| వెండి ఒక గ్రాము | రూ. 189.50 |

# పునర్విభజనపై పునరాలోచించుకోవాలి!

● రాపూరులో ఆగ్రహ జ్వాలలు

రాపూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రభుత్వం రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయడంపై మండల వాసుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు జిల్లాతో ఉన్న అనుబంధాన్ని ఇలా ఎవరూ అడగకుండానే పక్క జిల్లాలో విలీన ప్రతిపాదన చేయడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. 58 కి.మీ సమీపాన ఉన్న నెల్లూరు జిల్లాను వదులుకొని, 100 కి.మీ దూరంలో ఉన్న తిరుపతి జిల్లాలో కలపడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. జిల్లా మార్చాల్సిన అవసరం ఏముందని ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఇప్పటికే రాపూరు మండలం స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.



**కండలేరు నిర్వాసితుల సమస్యలు అధికమవుతాయి**

రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపడం సరికాదు. కండలేరు జలాశయం కొరకు మా భూములను ఇచ్చిన మేం ఇంత వరకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం తరపు నుంచి పరిహారం, ఉద్యోగ సమస్యలు ఇప్పటివరకు పరిష్కారం కాలేదు. ఈ సమయంలో రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ఈ నిర్ణయంపై మరొకసారి పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- బొమ్మిరెడ్డి రవీంద్రరెడ్డి, గుండవోలు,
కండలేరు నిర్వాసితుడు






**ప్రజాభిప్రాయం మేరకే నిర్ణయం తీసుకోవాలి**

ప్రజల అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా పరిగణలోకి తీసుకోవాలి. రాపూరు, సైదాపురం, కలువాయి, మండలాలను నెల్లూరుజిల్లానే కొనసాగించాలి. ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలి. తిరుపతి జిల్లా దూరంగా ఉండడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు వ్యయప్రయాసాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

గోవిందు రంగయ్య,
ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి



**రెవెన్యూపరంగా ఇబ్బందులు**

రాపూరు మండలం తిరుపతి జిల్లాలో విలీనమైతే రెవెన్యూ పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటాం. నెల్లూరు జిల్లా నుంచి మారితే భూ సమస్యలు అధికమవుతాయి. ప్రస్తుతం రెవెన్యూ డివిజన్ నెల్లూరులో ఉన్నందు వలన సౌలభ్యంగా ఉంది. తిరుపతికి తరలిస్తే దూరం అవ్వడమే కాకుండా, దూరంతోపాటు రెవెన్యూ సమస్యలు ఎదుర్కొంటాం. ఈ సమస్యలను గుర్తించి ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటుందని ఆశిస్తున్నాను.

- గంగిశెట్టి వెంకటేశ్వర్లు,
మార్కెట్ కమిటీ డైరెక్టర్, రాపూరు



**నెల్లూరు జిల్లాతో ప్రత్యేక అనుబంధం**

వ్యాపారరీత్యా నెల్లూరు జిల్లాతో మాకు ప్రత్యేక అనుబంధం ఉంది. మా తాతముత్తాతల నుంచి నెల్లూరు జిల్లా వాళ్లమని ఎంతో గొప్పగా చెప్పుకునేవాళ్లం. గత ప్రభుత్వంలో కూడా తిరుపతి విలీనం ప్రతిపాదించినప్పుడు పోరాడి జిల్లాలోనే నిలుపుకొన్నాం. ఇది ప్రభుత్వ తొందరపాటు నిర్ణయంగా భావిస్తున్నాం. ఈ విభజనపై ప్రజాభిప్రాయాలను తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. మా ఆత్మ గౌరవాన్ని కాపాడుకుంటాం. రాపూరును నెల్లూరు లోనే నిలుపుకొనేందుకు ఎంతవరకైనా ఉద్యమాలు చేస్తాం.

- సికిందర్, రాపూరు, వ్యాపారి



**విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతాం**

విద్యాపరంగా ఎంతో అభివృద్ధి చెందిన నెల్లూరుజిల్లాలో నుండి రాపూరు మండలాన్ని విభజించడం సరికాదు. వెనుకబడిన ప్రాంతాలైన రాపూరు, కల వాయి, సైదాపురం మండలాల విద్యార్థులు ఎంతో నష్టపోయే అవకాశం ఉంది. అలాగే ప్రభుత్వ ఉపా ధ్యాయులకు ఉద్యోగులకు నిత్యం జిల్లా కేంద్రంతో పనులు ఉంటాయి. నెల్లూరు అయితే అందరికీ చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

- రాపూరు శ్రీనివాసులు,
ప్రభుత్వ ఉపాధ్యాయుడు,
యూటీఎఫ్ జిల్లా ఆడిట్ మెంబర్



**రవాణా సౌకర్యం ఉండదు.. వ్యయప్రయాసలూ తప్పవు!**

తిరుపతి జిల్లాకు వెళ్లి రావడం అంటే వ్యయభారంతో పాటు రవాణా విషయంలో అసౌకర్యంగా ఉంటుంది. నెల్లూరుజిల్లా కేంద్రం, మాకు రవాణా బస్సు సౌకర్యం ఉంటుంది. రెవెన్యూ కార్యాలయంలో ఏమైనా వినతి ఇవ్వాలంటే తిరుపతి జిల్లా అయితే బస్సు సౌకర్యం సరిగా ఉండకపోగా, రెండు బస్సులు మారాల్సి ఉం టుంది. దీనివల్ల ప్రజలకు అసౌకర్యంగా ఉంటుంది. ఏదైనా విధానపరమైన విధానాలు తీసుకున్న తరువాత నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేది. అలా చేయక పోవడం బాధాకరం.

- ముక్తార్,
మాజీ సర్పంచి, రాపూరు.

## పాముకాటుతో వ్యవసాయ కూలీ మృతి



మృతి చెందిన రాజశేఖర్

జలదంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెంలో పాము కాటుకు వ్యవసాయ కూలీ షైనంపాటి రాజశేఖర్(42) మృతి చెందారు. మంగళవారం ఉదయం వ్యవసాయ పొలంలో వరినాట్లు పనులకు వెళ్లిన రాజశేఖర్ నారుమడి కుప్పల నుంచి వరి నారు కట్టలు తీసుకెళ్లే క్రమంలో కట్టల్లో ఉన్న పాము రాజశేఖర్ కాలుపై కాటేసింది. దీంతో తోటి కూలీలు హుటాహుటిన ఆయనను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తర లించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబపోషకుడు మృతి చెందడంతో ఆ కుటుం బం దిక్కుతోచని స్థితిలో శోకసముద్రంలో మునిగిపోయింది. మృతుడికి భార్య రాజితమ్మ, కుమార్తెలు భార్గవి, రోజ్‌మేరి ఉన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ముత్తుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మదేవం సమీపంలోని బుడ్డి డ్రైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (45) మంగళవారం లభ్యమైంది. బుడ్డి డ్రైన్‌కు మరమ్మతులు చేస్తుండగా కాలువ మధ్యలో మృతదేహం తేలడంతో స్థానికులు వీఆర్వోకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ముత్తుకూరు ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మూడు, నాలుగు రోజుల క్రితం కాలువలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. సమాచారం తెలిసిన వారు పోలీసులకు వివరాలు తెలియజేయాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం) డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో గాంధీ బొమ్మ సమీపంలోని సండే మార్కెట్ స్వతంత్ర పార్కు వద్ద పార్క్ చేసిన బైక్‌ను గుర్తుతెలియని దుండగులు దోచుకెళ్లిన ఘటనపై చిన్నబజారు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు నగరంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన భాస్కరుని సురేంద్రబాబు ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 3వ తేదీ సాయంత్రం స్వతంత్ర పార్క్‌కు బైక్‌పై వెళ్లారు. అక్కడ వాహనం పార్క్ చేసి లోపలికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూడగా బైక్ కనిపి ంచలేదు. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పట్టపగలే నగలు చోరీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఇంట్లోని బీరువాలో నగలు చోరీకి గురైన ఘటనపై చిన్నబజారు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని మూలాపేట ఈఎస్ఆర్ఎం స్కూల్ సమీపంలో గుజరాతీ అనే మహిళ కుటుంబం నివసిస్తోంది. గత నెల 15వ తేదీ మధ్యాహ్నం ఆమె ఇంట్లోని బీరువాలో పెట్టిన 8 సవర్ల బంగారు నగలు కనిపించలేదు. పక్కింట్లో ఉండే పుష్ప అనే మహిళ తరచూ వారి ఇంటికి వస్తుండేదని, ఆమే నగలు అపహరించి ఉంటుందని బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సచివాలయాల తనిఖీ

మనుబోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడూరు, కాగితాలపూరు, గురివిందపూడి, జట్లకొండూరు, చెరుకు మూడి సచివాలయాలను మంగళవారం డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల సిబ్బంది సరిగా హాజరుకాకపోవడం, సర్వేల పూర్తిస్థాయిలో కాకపోవడం పట్ల డిప్యూటీ ఎంపీడీవో సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యదర్శులు, సిబ్బంది స్వర్ణ పంచాయతీలపై ఆన్‌లైన్ నమోదులో వేగం పెంచాలన్నారు. జీఎస్ డబ్ల్యూవో గరుడయ్య పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు శ్రీకావ్య ఎంపిక



బహుమతి అందుకుంటున్న శ్రీకావ్య

మనుబోలు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని శ్రీకావ్య కౌశల్ (సైన్స్ ప్రతిభా అన్వేషణ పోటీ) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం. అమూల్య కుమారి తెలిపారు. జిల్లా స్థాయి కౌశల్ పోటీల్లో పోస్టర్ విభాగంలో శ్రీకావ్య విజయం సాధించింది. దీంతో శ్రీకావ్య ఈనెల 27న తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలో తన ప్రతిభ చూపనుంది. జిల్లా స్థాయిలో విజయం సాధించిన శ్రీకావ్యకు మంగళవారం డిఈవో కార్యాలయంలో ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఏఎంవో సుధీర్‌బాబు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందించారు. శ్రీకావ్యకు శిక్షణ ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయుని కామేశ్వరిని వారు అభినం దించారు. హెచ్ఎం శ్రీకావ్యను అభినందించారు.

## నిమ్మతోటలను పరిశీలించిన కాకాణి

పొదలకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు మండలం పులి కల్లు గ్రామంలో దిత్వా తుఫాను కారణంగా దెబ్బతిన్న నిమ్మ తోటలను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం కండలేరు జలాశయ స్పిల్ వేను సందర్శించారు. వర్షం నిలిచిపోయినా కూటమి ప్రభుత్వం పంట నష్టం అంచనాలు వేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

**ఆక్రమణకు గురైన స్థలాల పరిశీలన**

పొదలకూరు పట్టణంలోని రామ్‌నగర్ కూడలిలో ఆక్రమణకు గురైన విఘ్నేశ్వర ఆలయ స్థలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. స్థానికులపై దౌర్జన్యం చేసేవారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## కంపచెట్ల తొలగింపు

పొదలకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు - నెల్లూరు రహదారిలో మరు పూరు సమీపంలో రోడ్డు సేఫ్టీలో భాగంగా మంగళవారం పొదలకూరు సీఐ శివరామ కృష్ణా రెడ్డి, తన సిబ్బందితో కలిసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చారు. అలాగే ఇక్కడి వంతెన రాత్రి సమయంలో కనిపించేలా రేడియం స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్ నడిపేవారు చాలామంది ఇక్కడి గోతు ల కారణంగా ప్రమాదాల బారినపడుతు న్నా రని చెప్పారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు గుంతలను పూడ్చి, రేడియం స్టిక్కర్లు అంటించినట్లు తెలిపారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



రాపూరుపోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న ఐజీ త్రిపాఠి

పొదలకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. పొదలకూరు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ మహమ్మద్ హనీఫ్, తదితరులున్నారు.

**రాపూరు పోలీస్ స్టేషన్ తనిఖీ**

**రాపూరు:** రాపూరు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి సాధారణ తనిఖీలలో భాగంగా రాపూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్రైం రికార్డులు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, నేరాలు, దొంగతనాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ స్టేషన్‌లో చిన్న చిన్న భూ సమస్యలు ఉన్నట్లు తెలిపారు. సిబ్బందికి కొన్ని సూచనలు ఇచ్చారు. అనంతరం పెంచలకోనకు వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, ఆత్మకూరు డిఎస్పీ కే. వేణుగోపాల్, ఎస్బీడిఎస్పీ శ్రీనివాసరావు, నెల్లూరు రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్య నారాయణ, ఎస్‌ఐ వెంకటరాజేష్, సిబ్బంది ఉన్నారు.

## విజన్ బిల్డింగ్‌తో ప్రయోజనం...అభివృద్ధి

రాపూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించామని ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. మహిళలు సాంకేతికను సక్రమంగా ఉపయోగించుకోవాలని తెలిపారు. సుస్థిర జీవనోపాధి వంటి 8 అంశాలపై శిక్షణ నిర్వహించామని ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల సమైక్య వోబి మెంబర్లు, ఈసి మెంబర్లు, సిసిలు, వివోఏలు పాల్గొన్నారు.

## బకాయిలు వంద శాతం వసూలు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలను వంద శాతం వసూళ్ళు చేసేందుకు కృషి చేయాలని రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులను కమిషనర్ బాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళె మున్సిపల్ కౌన్సిల్ హాల్లో కమిషనర్ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీలోని రెవెన్యూ, సచివాయాలయాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంధన పొదుపుపై పిల్లలకు పోటీలు

మనుబోలు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పొదలకూరు ఏడిఈ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ఇందనపొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ పొదుపే విద్యుత్ ఉత్పత్తి అనే అంశంపై పిల్లలకు వ్యాసరచన పోటీలు, వకృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో విజేతలకు 14న బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ. అనీల్‌కుమార్, ఎంఈవో నరేష్‌కుమార్, టీడీపీ నాయకులు దందు చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం పాల్గొన్నారు.

## సాదాబైనామా గడువు పొడిగింపు

విడవలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సాదాబైనామా( అగ్రిమెంట్ ఫార్ సేల్) ద్వారా భూములను క్రమబద్ధీకరించుకోసేందుకు కాలపరిమితిని డిసెంబరు 31- 2027 వరకు పొడిగించిందని తహసీల్దారు చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 6- 2024కు మునుపు అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసిన పట్టాభూములను క్రమబద్ధీకరించుకోనేందుకు సచివాలయంలోగాని, మీసేవాలోగాని రైతులు దరకాస్తులు చేసుకోవాలన్నారు. దరకాస్తు చేసుకున్న 90రోజుల్లో భూములను క్రమబద్ధీకరించటం జరుగుతుందన్నారు. సన్న కారు రైతులకు మాగాణి 1.25సెంట్లు, మెట్ట 2.50 సెంట్లు, చిన్నకారు రైతులకు మాగాణి 2.50సెంట్లు, మెట్ట 5ఎకరాలు వరకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు.

## 80 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



రైతుకు విత్తనాల వడ్లు అందిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన దిత్వా తుఫానుకు జిల్లా వ్యాప్తంగా లక్ష ఎకరాల్లో వరినార్లు దెబ్బతిన్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైతుసేవా కేంద్రం వద్ద మంగళవారం నార్లు దెబ్బతిన్న రైతులకు ఎమ్మెల్యే చేతులమీదుగా కేఎన్ఎం రకం విత్తనాల వడ్లను పంపిణీ చేశారు. 46 వేల 674 ఎకరాలకు సంబంధించి సర్వేపల్లి నియోజకవర్గంలో నార్లు దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ మంత్రి అచ్చెన్ననాయుడుతో మాట్లాడిన అరగంటలోనే నిర్ణయం తీసుకుని, 80 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలని అధికారులకు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. బుధవారం నుంచి రైతులకు విత్తనాలు అందిస్తారన్నారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఏవో వెంకటకృష్ణయ్య, ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణా రెడ్డి, కేసీపీసీ ఛైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, రాయపాటి కిరణ్, ముంగర విజయ భాస్కర్ రెడ్డి, చెల్లగిరి ప్రసాద్, శివుడు రాజాగౌడ్, చింతల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్టు లేక చేపల వ్యాను బోల్తా

తోటపల్లిగూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాలపేట సెంటర్ వద్ద కల్వర్టు లేక చేపలు వ్యాను కాలువలోకి బోల్తా పడింది. స్థానికులు వివరాలు మేరకు తోటపల్లి గూడూరు నుంచి ఈదూరు వైపు చేపలు వ్యాను మంగళవారం సాలిపేట సెంటర్‌లో కాలువకు ఇరువైపుల కల్వర్టు లేకపోవడంతో బోల్తా పడిందని తెలిపారు. గత సంవత్సరం నుంచి తాగునీరు పైపులైన్ కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టును పగులగొట్టి పైపులైన్ వేశారు. అప్పటి నుంచి వాటిని నిర్మించకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. గతంలో కూడా అనేక ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులు స్పందించపోవడం విశేషం. ఇకనైనా కల్వర్టును నిర్మించి ప్రమాదాలను అరికట్టాలని ఆ మార్గాన సురక్షితంగా వాహనదారులు వెళ్లే విధంగా ఆ రోడ్డుకు మరమ్మతులు చేసి కల్వర్టును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

## మినగల్లు సచివాలయం తనిఖీ

అనంతసాగరం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు సచివాలయాన్ని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూడాలని ఆదేశించారు. ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంపీడీవో షానవాజ్ ఉన్నారు.

## నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

ఆత్మకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శివకేశ్‌యాదవ్ మంగళవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణీకులు 9959225645 నెంబరుకు ఫోన్ చేసి మెరుగైన సేవల కోసం సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

## అక్కడ ఒక్కరు.. ఇక్కడ ఇద్దరు!

● ఉద్యోగుల్లో మారని తీరు
● సచివాలయాల్లో అందని సేవలు



జీ.కొండారెడ్డిపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీసు



గుడినరవలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉద్యోగులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అడిగేవారు లేరులే అన్న ధీమానో.. లేక ఎవరేమనుకున్నా డోంట్ కేర్.. అనుకున్నారో ఏమోగానీ.. సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరిపై అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ వారిలో ఎలాంటి మార్పు కనిపించడమే లేదు. జిల్లా కేం ద్రానికి శివారు ప్రాంతా లు కావడంతో వరికుంటపాడు, ఉదయగిరి మం డలాల్లో అలాం టి పరిస్థితి మరింత దారుణం గా కన్పిస్తోంది. జిల్లా కేంద్రానికి సుమారు వంద కి.మీ పైబడి దూరం ఉండడంతో ఉన్నతాధికారుల తనిఖీలు ఉండవనే ఉద్దేశంతోనే ప్రతినిత్యం కొంతమంది ఉద్యోగులు ఎంచక్కా విధులకు ఎగనామం పెడుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన మండల స్థాయి అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడక పోవడంతోనే తాము ఆడిందే ఆట, పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం వరికుంటపాడులోని జీ.కొండారెడ్డిపల్లి సచివాలయంలో మధ్యా హ్నం 1 గంట వరకు కేవలం మహిళా పోలీసు మాత్రమే విధుల్లో ఉన్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. అలాగే తామేమి తక్కువ కాదన్నట్లు ఉదయగిరిలోని గుడినరవ సచివాలయంలోనూ వెటర్నరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు మాత్రమే విధుల్లో ఉండడం విశేషం. అంతవరకు మిగిలిన ఉద్యోగులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వారి కోసం గంటల తరబడి ఎదురు చూసిన ప్రజలు చేసేదేమిలేక నిరాశగా వెళ్లిపోవడంతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు లేక ఆ సచివాలయాలు బోసిపోయాయి. కొంతమంది ఏకంగా విధులకు ఎగనామం పెడుతుండగా, మరి కొంతమంది ఫీల్డు, మీటింగుల పేరుతో ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. వీరికితోడు కనీసం జీ.కొండారెడ్డిపల్లిలోని విలేజ్ హెల్త్ క్లినిక్ తలుపులు తెరుచుకోక పోవడం చూస్తుంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కోదండరాముడి ఆలయ భూముల పరిశీలన



ఆలయ భూముల మ్యాపును పరిశీలిస్తున్న జిల్లా దేవదాయశాఖాధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచేడు రెవెన్యూ గ్రామంలోని కావేటిపల్లం ప్రాంతానికి చెందిన బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో కొలువైవున్న సీతా,లక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి చెందిన కావేటి పల్లంలోని వ్యవసాయ భూములను దేవాదాయశాఖ, రెవెన్యూ, సర్వే అధికారులు మంగళవారం పరిశీలించారు. టైటిల్ డీడ్ నెంబరు 1888లోని బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో కొలువైవున్న సీతా, లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారి ఆలయానికి చెందిన సుమారు 452.05 ఎకరాలు భూములను పరిశీలించి రైతులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయశాఖలోని ఆలయ భూములను పరిశీలనలో భాగంగా కోదండరామస్వామి ఆలయ భూములు పరిశీలించినట్లు తెలిపారు. తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, డిప్యూటి తహసీల్దారు మల్లికార్జున, మండల సర్వేయర్ సోమేశ్వరరావు, వీఆర్వో జైశీల పాల్గొన్నారు.

## సకాలంలో చర్యలతో వరి పైరుకు రక్షణ



ముత్తుకూరు: పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ముత్తుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే వరి పైరును కాపాడుకోవచ్చని వరి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ వినీత సూచించారు. మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నరాణితో కలిసి మంగళవారం పిడతాపోలూరులో దిత్వా తుఫాను కారణంగా దెబ్బతిన్న వరినారిమళ్లు, వరి, వేరుశెనగ పొలాలను సందర్శించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వరి ప్రధాన పొలంలో నిల్వ ఉన్న నీటిని తొలగించి వెంటనే కుళ్లు తెగులు నివారణకు భావిస్టిన్ 1గ్రాము మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ దేవసేనమ్మ, ఏవో గీతకుమారి, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

**తోటపల్లిగూడూరు :** మండలంలోని కోడూరు మేజర్ పంచాయతీలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్ర వ్యసాయ సంచాలకులు దేవసేనమ్మ మాట్లాడుతూ దిత్వా తుఫాను వల్ల దెబ్బతిన్న నారుమడులు, వరినాట్లు పరిశీలించారు. ఆకుముడత, జింక్ లోపం ఉన్న వరి నాట్లకు క్లోరోపైరిఫాస్ పిచికారి చేయాలని తెలిపారు. యూరియా అధికంగా వాడటం వల్ల చీడపురుగులు ఎక్కువగా ఉంటాయని తగిన మోతాదులో వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శిరీషరాణి, గీతాకుమారి, రైతులు పాల్గొన్నారు.

## 'పొలం పిలుస్తోంది'లో రైతులకు వ్యవసాయ సలహాలు

**విడవలూరు:** నారుమడులు దెబ్బ తిన్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కింద విత్తనాలను అందజేస్తుందని, ఈ మేరకు నివేదికలను ప్రభుత్వానికి పంపామని వ్యవసాయాధికారి లక్ష్మి తెలిపారు. ముదివర్తి, అన్నారెడ్డిపాళెంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత దెబ్బతిన్న వరిపైర్లని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబరు రఫీ, వీఏఏలు వెన్నెల, సాయిలక్ష్మి, కవిత, శ్రావ్య పాల్గొన్నారు.

**గూడూరు అర్బన్ (సైదాపురం) :** మండలంలోని ఊటుకూరు, తురిమెర్ల గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ శ్రీదేవి మాట్లాడుతూ శ్రీవరి సాగు ప్రయోజనాలు, వరిలో పొటాషియం వాడకం వల్ల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి, మాజీ సర్పంచ్ టి దశయ్య నాయుడు, మాజీ ఎంపీటీసీ టీవీఎల్ నారాయణరావు, పలువురు వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

**చికెన్ ధరలు**
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 150 |
| స్కిన్ చికెన్ | 270 |
| స్కిన్‌లెస్ | 294 |
| కోడిగుడ్ల ధర (100): | 670 |



## వేదగిరీశుని సన్నిధిలో రామానంద భారతిస్వామి

నెల్లూరు(సిటీ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం సౌభాగ్య భువనేశ్వరి పీఠం అధిపతి రామానంద భారతి స్వామి మంగళవారం వేదగిరి క్షేత్రాన్ని సందర్శించారు. అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికింది. లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు వివరించారు. జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుత రెడ్డి అందచేశారు.

# సోదాలు రెండు రోజులే..!

● ఎనీ టైం మందు లభ్యం ● అర్ధరాత్రి కూడా తెరిచే ఉంటున్న మద్యం దుకాణాలు ● నిబంధనలు పాటించని వైనం





ఆత్మకూరు బస్టాండు వద్ద అర్ధరాత్రి కూడా తెరిచి ఉన్న వైన్ షాపు



స్టోన్‌హౌస్‌పేటలో అర్ధరాత్రి వేళ వ్యాపారం సాగిస్తున్న దుకాణాలు

నెల్లూరు(క్రైం) డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో వరుసగా నేరాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు నగర వ్యాప్తంగా రెండు రోజులుగా రాత్రిపగలు తేడాలేకుండా వరుసగా తనిఖీలు నిర్వహించారు. అర్ధరాత్రి రోడ్లపై అకారణంగా తిరిగే వారిపై లాఠీ ఝుళిపించారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా తనిఖీలు కొనసాగుతాయని భావించి, అవి ఎలా ఉన్నాయోనని ఆంధ్రజ్యోతి పరిశీలిస్తే అంతా రెండు రోజుల హంగామా అని తేలింది. రాత్రి 10 గంటలకు మూయాల్సిన వైన్ షాపులు ఎప్పటిలాగానే 11 గంటలు దాటినా తెరుచుకునే ఉన్నాయి. రాత్రి 10 గంటలు దాటాక రోడ్లపై ప్రజలు కనిపిస్తే కారణం లేకుండా దాడులు చేస్తున్న పోలీసులు, ప్రధాన ప్రాంతాల్లో వైన్ షాపులు తెరిచి ఉన్నా పట్టించుకోకపోవడం గమనార్హం. నగరంలో రాత్రింబవళ్లు మద్యం దుకాణాలు తెరుచుకొని ఉండటం, ఇతర దుకాణాల్లో టచ్చింగ్ దొరుకుతుం డటంతో మత్తులో జరిగే నేరాలు తారాస్థాయికి చేరుతున్నాయి.



## భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో మంగళవారం కాత్యాయనీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంక రించారు. ఉదయం చండీ హోమం, విశేష పూజలు జరిగాయి.

## ఉత్సాహంగా పెన్షనర్ల ఆటల పోటీలు

కావలి(టౌన్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పెన్షనర్స్ డేని పురస్కరించుకుని కావలి తాలూకా పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియం మైదానంలో నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ ఆటల పోటీలను విశ్రాంత డైట్ అధ్యాపకుడు తూపిరి సుందరరామిరెడ్డి ప్రారంభించారు. ఆటల పోటీల్లో మహిళలు, పురుషులు వృద్ధాప్యాన్ని మరిచి గెలవాలన్న తపనతో పోటీ పడిన తీరు పలువురిని ఆకట్టుకుంది. షాట్‌పుట్, త్రోబాల్, డిస్కస్‌త్రో, క్యారమ్స్, చెస్ క్రీడాంశాల్లో 70 ఏళ్ల లోపు, పైబడిన వారికి రెండు విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈనెల 17న విజేతలకు బహుమతులు అందిస్తామని రమణయ్య తెలిపారు.

## కావలిని కప్పిన మంచు దుప్పటి



పొగమంచులో చిక్కుకున్న సూర్యభగవానుడు

కావలి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితుల ప్రభావంతో మంగళవారం దట్టమైన పొగమంచు దుప్పటిలా కావలిని కప్పేసింది. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం మంచు కారణంగా ప్రజలతో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు కూడా చలి తగ్గకపోవడం, మంచుతో జాతీయ రహదారిపై ముందున్న వాహనాలు, ఎదురొచ్చే వాహనాలు సైతం కనిపించక పోతుండడంతో వాహనాలను రోడ్డు పక్కన నిలిపి మంచు తగ్గిన తరువాత వాహనదారులు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

## రుక్మిణి కల్యాణం ఆంగ్ల కవితా సంపుటి ఆవిష్కరణ



రుక్మిణి కల్యాణం కవిత సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయిత, ప్రముఖులు

నెల్లూరు (సాంస్కృతి కం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ఆంగ్ల కవి మైదవో లు వెంకట శేష సత్యనారా యణ రచించిన శ్రీరుక్మిణి కల్యాణం ఆంగ్ల కవితా సంపుటిని మంగళవారం నగరంలోని కృష్ణ మంది రంలో ఆవిష్కరించారు. దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో టంగుటూరు గోపాల్‌రెడ్డి, డాక్టర్ నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

## లార్వా దశలోనే దోమలను నివారించాలి

● జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లార్వా దశలోనే దోమలను నివారించాలని, తద్వారా ప్రాణాంతక వ్యాధులను అరికట్ట వచ్చ ని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ ఆదేశించారు. మంగళవారం నగరంలోని కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆశాల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఆశాలు ప్రతీరోజూ ఇంటింటికి తిరిగి నీటి నిల్వలను పరిశీలించి రోజుల తరబడి నిల్వ ఉన్న నీటిని పార బోయాలన్నారు. ఫ్రైడే.. డ్రైడే విధానాన్ని తప్పక పాటించాలని సూచించారు. మలేరియా నిర్ధారణకు రక్తపూతలు సేకరించి ల్యాబ్‌కు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునపురం, రాజాగారివీధి, చాకలివీధి పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది, మలేరియా విభాగం అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ఆట్యాపాట్యాకు జిల్లా క్రీడాకారులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చండీఘర్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఈనెల 12 నుంచి జరిగే 36వ జాతీయ జూనియర్ ఆట్యాపాట్యా పోటీలకు నగరంలోని ఏసీనగర్ ఎంఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ మురళీకృష్ణ తెలిపారు. పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థినులు ఎస్ రిషిత, ఏ వైష్ణవి ఈ ఏడాది సెప్టెంబరులో పిడుగురాళ్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. జాతీయ పోటీల్లో కూడా ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పీ అజయ్‌కుమార్, పీఈటీ రేష్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ పోటీలకు ఎంపికైన బాలికలతో హెచ్‌ఎం మురళీకృష్ణ, పీడీ అజయ్ కుమార్ తదితరులు

## కృష్ణుడి దృష్టంతా శిష్ట రక్షణకే..!

● ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణుని దృష్టంతా శిక్ష రక్షణకే పరితపిస్తుంటుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. శ్రీభరద్వాజ రుద్రాభిషేక సంఘం ఆధ్వర్యంలో నగరంలోని పురమందిరంలో ఆయన చేస్తున్న ప్రవచనాలు మంగళవారం నాలుగో రోజు కొనసాగాయి. ముందుగా జగన్నాథ ఉత్సవమూర్తులకు పూజలు చేసి అనంతరం శంకరాచార్య కృత జగన్నాథ అష్టకంపై ప్రసంగించారు. పూరి క్షేత్రంలో జరిగే జగన్నాథ రథయాత్ర విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు.



పూరి జగన్నాథ ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

## మెగా జాబ్ మేళాలో 92 మంది ఎంపిక

నెల్లూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ ఐపీఎస్ కళాశా లలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వ హించారు. దీనిని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ఉద్యోగాల కల్పనలో ఏపీ హబ్‌గా మారుతోందని తెలిపారు. కాగా, ఈ మేళాలో 15 సంస్థలు పాల్గొన్నాయి. 171 మంది అభ్యర్థులు హాజరుకాగా 92 మంది వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ వీ తనూజ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి వి.వినయ్‌కుమార్, సెట్నల్ సీఈఓ ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● 23వ డివిజన్ పడారుపల్లి పీహెచ్‌సీలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సఖి సురక్ష మెగా వైద్య శిబిరాన్ని గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే, 17వ డివిజన్ సాయి బాలాజీ నగర్, నిర్మల నగర్‌లో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు.

## చేపల వేలానికి సిద్ధం చేయండి

● పంచాయతీ కార్యదర్శులకు అధికారుల ఆదేశాలు
● గిరిజన పాఠశాల మరమ్మతులకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీ చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కుల కేటాయింపులకు సంబంధించిన వేలంపాటలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. చేపల చెరువులకు వేల వేస్తారా...? శీర్షికతో ఆంధ్రజ్యోతి మంగళవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు చేపల పట్టుకునే చెరువులున్న పంచాయతీలన్నిటికీ నోటీసులు జారీ చేసినట్లు మండల విస్తరణ అధికారి రమేష్‌బాబు తెలిపారు. చెరువుల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి అనుమతుల కోసం పంపాలని సూచించినట్లు పేర్కొన్నారు.

### పాఠశాల మరమ్మతులకు...

మండలంలోని సౌత్‌మోపూరు పంచాయతీ కనుజుల మిట్ట (గిరి జన కాలనీ)లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శ్లాబు పెచ్చులూడి కిందపడటంతో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ విద్యాబోధన సాగిస్తున్న ట్లు ఆంధ్రజ్యోతిలో వెలువడి కథనానికి జిల్లా విద్యాశాఖ స్పందించింది. మండల విద్యాశాఖ అధికారి మురళీధర్ నేతృత్వంలో మంగళవారం పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు తాత్కలికంగా బయట ఉంచి చదువు చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమగ్ర శిక్ష విభాగం పరిశీలన అనంతరం మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

## నెల్లూరులో రైల్వే ఆసుపత్రి ఏర్పాటు చేయండి

● కేంద్ర మంత్రికి ఎంపీలు వేమిరెడ్డి, బీద విజ్ఞప్తి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో పూర్తి స్థాయి రైల్వే వైద్యశాలను ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఢిల్లీలో కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి రోజుకు రమారమి 22వేల మంది ప్రయాణిస్తున్నారని, స్టేషన్ మీదుగా 110 రైళ్లు నడుస్తున్నాయని తెలిపారు. స్టేషన్ అభివృద్ధికి ఇప్పటికే రూ.102 కోట్ల నిధులు విడుదలయ్యాయని వివరించారు. అయినా జిల్లా కేంద్రంలో రైల్వే వైద్యశాల లేకపోవటంతో ఉద్యోగులు, పింఛన్‌దారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తమ విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీలు తెలిపారు.

## ఏపీలో 638 పారిశ్రామిక పార్కులు

● ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పార్కుల గురించి వివరించాలని లోక్‌సభలో మంగళవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర వాణిజ్య-పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 638 పారిశ్రామిక పార్కులు ఉన్నాయని, పారిశ్రామికాభివృద్ధికి భారత ప్రభుత్వం మద్దతు ఇస్తోందని తెలిపారు. అదేవిధంగా సుగమ్య భారత్ అభియాన్‌లో సాంకేతిక పరిజ్ఞానానికి ఎంత ఖర్చు చేశారని ఎంపీ వేమిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ సమాధానం ఇచ్చారు. సుగమ్య భారత్ అభియాన్ కార్యక్రమంలో రవాణా వ్యవస్థను మెరుగు పరచటం, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ వ్యవస్థను తయారు చేయటం చేస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వ భవనాల రెట్రో ఫిట్టింగ్ కోసం క్రియేషన్ ఆఫ్ బారియర్ ఫ్రీ ఎన్విరాన్‌మెంట్ పథకం కింద తొలి విడతగా రూ.31 లక్షలు విడుదలైనట్లు వివరించారు. అదే విధంగా డీప్ సీ ఫిషింగ్ అభివృద్ధికి కేంద్రం తీసుకుంటున్న చర్యలేమిటని వేమిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ సహాయ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమాధానం ఇస్తూ డీప్ సీ ఫిషింగ్ వనరుల పొటెన్షియల్ దిగుబడి 2.31 లక్షల టన్నులని వివరించారు.

## రూఫ్ టాప్ సోలార్‌తో ఆదాయం ఎలా?

● రాజ్యసభలో ఎంపీ బీద మస్తాన్‌రావు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా రూఫ్ టాప్ సోలార్‌ను ఆదాయ వనరుగా రూపొందించడానికి ప్రభుత్వం చేపడుతున్న విధానాలు, అందిస్తున్న సబ్సిడీలను వివరించాలని రాజ్యసభలో మంగళవారం ఎంపీ బీద మాస్తాన్‌రావు ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీపాద్ యశోనాయక్ సమాధానం ఇచ్చారు. 2025-26 నాటికి దేశంలో ఒక కోటి ఇళ్లకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయటం లక్ష్యమని వివరించారు. ప్రతీ ఇంటికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత, తక్కువ ఖర్చుతో విద్యుత్ అందించటం దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రూఫ్‌టాప్ సోలార్ ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

## అనుమతుల్లేకుండా నిర్మాణాలు వద్దు

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : నగరంలో సిటీ ప్లానింగ్ విభాగం అనుమతులు లేకుండా ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని నగర కమిషనర్ నందన్ ప్రజలకు సూచించారు. అల్లీపురం రహదారి వెంకయ్యస్వామి లేఅవుట్‌లో ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్‌పై స్థల యజమానులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. 12వ డివిజన్ వావిలేటిపాడు, ధనలక్ష్మీపురం ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణపై వారికి అవగాహన కల్పించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సిటీ నియోజక వర్గానికి సంబంధించి ఓటరు జాబితాపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ వసూళ్లపై ఆ విభాగంతో సమీక్షించారు.

## వెంకటేశ్వరపురంలో నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లూరు(వెంకటేశ్వరపురం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వర పురంలో విద్యుత్తీగలకు మరమ్మతుల కారణంగా బుధ, గురువారాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏడీఈ సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెంకటేశ్వరపురం, గాంధీగిరిజన కాలనీ, జనార్దన రెడ్డి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, స్థానికులు సహకరించాలని కోరారు.

## ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

నెల్లూరు(విద్య), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఆర్‌ఆర్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో గొలగమూడిలో వారం రోజులు నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ శిబిరం విజయవంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీ రవికుమార్ తెలిపారు. చివరి రోజైన మంగళవారం స్థానిక పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశామని, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ శీనమ్మ, కార్యదర్శి ఈ అనూష, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దోర్నాదుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు ఎం వెంకటేశ్వర్లు, కళాశాల సిబ్బంది జాకీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### డీకే కళాశాల ఆధ్వర్యంలో...

డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో టైలర్స్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హోమ్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ అపర్ణాదేవి మాట్లాడుతూ విద్యార్థులను చిన్నతనం నుంచి అన్నీ రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నతంగా రాణిస్తారన్నారు. అనం తరం పలు సేవా కార్యక్రమాలు, మానవతా విలువల గురించి విద్యార్థులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో శివయ్య, సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ రోడ్లకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

మామిడిపూడి రోడ్డు, రావిపాడు అప్రోచ్ రోడ్డు, కేయూఎస్ రోడ్డు - దేవిశెట్టిపల్లి రోడ్డు వయా అయ్యప్పవారిపాలెం, నేకునంపేట రోడ్డు - కొమ్మిపాలెం ఇస్కపాలెం రోడ్డు, డీకేడీ రోడ్డు - కొత్తపేట వయా నరవాడ రోడ్డు, తీర్థంపాడు రోడ్డు- సీసీ కండ్రిగ రోడ్డు, రాపూరు రాజంపేట రోడ్డు - కోతూరుపాడు రోడ్డు, పెంచలకోన ఆర్అండ్‌బీ రోడ్డు - ఎంజీపల్లి ఎస్టీ కాలనీ రోడ్డు.

5 ఏళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడి లైంగిక దాడి కేసులో...

## 20 ఏళ్లు జైలు, రూ.25వేల జరిమానా



నెల్లూరు (లీగల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిన్నారి పాపపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో రాయదుర్గం వెంకటేశ్వర్లు అనే నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, 25 వేల రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోవూరు మండలం పాటూరు గ్రామం కామాక్షమ్మ కాలనీకి చెందిన రాయదుర్గ వెంకటేశ్వర్లు 63 సంవత్సరాల వృద్ధుడు. 2021 ఏప్రిల్ 21వ తేదీన అదే ప్రాంతానికి చెందిన ఐదేళ్ల పాపపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదుతో నెల్లూరు దిశ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ చంద్రశేఖర్ వాదించారు.

## శునకాలపై ప్రత్యేక డ్రైవ్



వలతో కుక్కను పట్టుకుంటున్న సిబ్బంది

వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు కార్పొరేషన్ పశువైద్య విభాగం సిద్ధమైంది. ప్రాంతాల వారీగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. ఇందులో భాగం గా మంగళవారం నగరంలోని మూలపేట, క్రాంతినగర్, రాజీవ్ గృహకల్ప, మనుమసిద్ధి నగర్‌లో వీధి కుక్కలను పట్టుకున్న సిబ్బంది, వాటిని ప్రత్యేక వాహనాల్లో పాతమున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఏబీసీకి తరలించారు. అక్కడ వాటికి సంతానోత్పత్తి నివారణ చికిత్స, యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశాక వదిలిపెడతామని మున్సిపల్ పశువైద్యాధికారి మదన్‌మోహన్ తెలిపారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

## విద్యార్థులు దృఢంగా ఉండాలి

నెల్లూరు(విద్య), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉంటే ఏదైనా సాధించగలరని ప్రభుత్వ వైద్య కళాశాల మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ లక్ష్మీప్రసన్న సూచించారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బీవీ నగర్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో మానసిక సమస్యలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు అనేక రకాల మానసిక సమస్యలు, అనవసరమైన ఆలోచనలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని అధిగమించేందుకు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. చదువుతోపాటు ఆటల్లో పాల్గొనాలని, తల్లిదండ్రులతో అన్నీ విషయాలను పంచుకోవాలని, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, జీజీహెచ్ సైకాలజిస్ట్ పీ సరస్వతి, విద్యార్థి సంఘం నాయకులు నిర్మల, కీర్తన, శివం వర్మ తదితరులు పాల్గొన్నారు.

## చిలుకోటి వరదయ్యకు సోమిరెడ్డి పరామర్శ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన బీజేపీ సీనియర్ నాయకుడు చిలుకోటి వరదయ్యను నగరంలోని లోటస్ వైద్యశాలలో మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై డాక్టర్లను, బీజేపీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. వరదయ్య లాంటి వారితో కలిసి సారా వ్యతిరేక ఉద్యమంతోపాటు పలు ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వంశీధర్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చిలుకోటి వరదయ్యను పరామర్శిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

# జిల్లా న్యాయాధికారిగా ప్రతిమ



నెల్లూరు (లీగల్), డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయాధికారికిగా నెల్లూరు నగరానికి చెందిన తిరువళ్లూరు ప్రతిమను ఎంపిక చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె 2003లో న్యాయశాస్త్రం పట్టా పుచ్చుకున్నారు. అప్పటి నుంచి నెల్లూరు బార్ అసోసియేషన్‌లో మెంబరుగా చేరి న్యాయవాద వృత్తిని కొనసాగించారు. 2020లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణురాలయ్యారు. ఆమెకు మొదటి పోస్టింగ్‌ను ప్రకాశం జిల్లా పరుచూరులో వేశారు. 2023లో నెల్లూరు నగరానికి బదిలీ అయి మొదటి తరగతి స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల హైకోర్టు వారు జిల్లా న్యాయాధికారి పోస్టులకు నిర్వహించిన పరీక్షలు రాసి, మంచి మార్కులు సాధించి ఈ పదవికి ఎంపిక అయ్యారు. ప్రతిమ జిల్లా న్యాయాధికారి పదవికి ఎంపిక కావడం పట్ల ఆమె సహచరులతో పాటు పలువురు న్యాయవాదులు ఆమెను అభినందించారు.





## వర్షం తగ్గినా...
# తగ్గని వరద !

ఈనెల ప్రారంభంలో జిల్లాను తుఫాన్ వర్షాలు కుదిపేశాయి. ఆ వర్షాలకు ఇబ్బందులు పడిన జనం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. రైతులు పంటలు కోల్పోయి ఎంతో నష్టపోయారు. ఆ నష్టాల నుంచి వారు కూడా బయటపడుతున్నారు. అయినా కొన్ని ప్రాంతాల్లో నేటికీ వర్షపునీరు తగ్గలేదు. దీంతో ఆ ప్రాంత వాసులు అష్టకష్టాలు పడుతున్నారు. పొట్టేపాలెం వద్ద ఇంకా నెల్లూరు చెరువు కలుజులు పారుతున్నాయి. అలాగే అక్కడ వేసిన లేఅవుట్ నదిని తలపిస్తున్నది. ఆ లేఅవుట్ నిర్మించిన ఇళ్లు కూడా నీటి మునిగాయి. ఆలేవుట్‌లోని నిర్మాణాలు సముద్రంలో ఉన్నట్లుగా అనిపిస్తున్నాయి.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, నెల్లూరు



# రెండు కార్ల ఢీ : ఏడుగురికి తీవ్ర గాయాలు

వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మలుపు వద్ద వేగంగా వెళ్తూ రెండుకార్లు ఢీకొనగా, ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి.ఈ సంఘటన మండలంలోని బొంత వారిపాలెం సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వీవీపాలెం హైస్కూల్‌లో పనిచేస్తున్న హెచ్ఎం కమల్‌కుమార్, టీచర్లు కత్తి ఐజాక్, బ్రహ్మయ్య, రామారావు, ఎన్‌వీఎల్ కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వారితోపాటు మరోకారులో ఉన్న రావినూతల సూర్యకు, శానంపూడికి చెందిన డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. టీచర్లు కందుకూరు నుంచి వీవీపాలెం హైస్కూల్‌కు కారులో వెళ్తున్నారు. అదే సమయంలో నూకవరం నుంచి కందుకూరు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వీవీ పాలెం 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మరిదినాయుడు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




కాకుటూరు సమీపంలోని హైవేలో బోల్తాపడి నుజ్జునుజ్జయిన కార్లు,క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్తున్న 108 సిబ్బంది

# పరిష్కారం దిశగా సాదా బైనామాలు

● వీడనున్న చిక్కుముడి ● ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో కొనుగోలు చేసిన భూములపై నేటికీ పూర్తిస్థాయి హక్కులు కల్పించుకోలేక పలువురు రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. అప్పట్లో రిజిస్ట్రేషన్ల భారం భరించలేక కొంతమంది కేవలం స్టాంపు పేపర్లు, తెల్లకాగితాలపై అగ్రిమెంట్లు చేసుకొని భద్రపరుచుకున్నారు. అలాంటి కాగితాలనే అధికారికంగా సాదాబైనామాలుగా వ్యవహరిస్తున్నారు. వాటినే సర్వహక్కులుగా భావించిన పూర్వీకులు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. అందుకు భిన్నంగా నిన్నమొన్నటి వరకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పట్టాదారు పాసుపుస్తకాల కోసం కార్యాలయాలకు పరుగులు తీసిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారులు చెప్పేవారు. రైతులు చేసేదేమి లేక వెనుతిరగాల్సి వచ్చేది.ఈ పరిస్థితుల నేపథ్యంలో సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం తీసుకొచ్చిన తాజా ఉత్తర్వులతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.



తెల్లకాగితాలపై రాసుకున్న అగ్రిమెంటు

● సాదాబైనామాలపై వినతులు

ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేలోనూ అధికశాతం వినతులు సాదాబైనామాలకు చెందినవే. వాటిపై దృష్టి సారిస్తే దాదాపుగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయి. కనీసం ఆన్‌లైన్ చేయించుకొనే అవకాశం కూడా లేకపోవడంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు.అంతేగాక గత భూ రికార్డులను ఆధారంగా చేసుకొని హక్కుదారుల వారసులకే పట్టాలు అందచేస్తామని అధికారులు చెబుతుండడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

● చిగురిస్తున్న ఆశలు

ఈ నేపథ్యంలో ఏళ్ల తరబడి విసుగెత్తిపోయిన రైతులు ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ముందుకు సాగుతున్నారు. 2024 జూన్ 15కంటే ముందుగా అగ్రిమెంట్లు చేసిన రైతులకు ఈ నిర్ణయం వరంగా మారనుంది. అలాంటి వారికి 2027 డిసెంబరు 31 వరకు దరఖాస్తు చేసేకొనే అవకాశం కల్పించింది. వీటికితోడు గతంలో సమస్య పరిష్కారానికి ఏడాదిగా ఉన్న గడువును కేవలం 90 రోజులకే కుదించింది. ఈ నేపథ్యంలో 2.5 ఎకరాల మాగాణి, 5 ఎకరాల్లోపు మెట్ట భూములు కలిగిన రైతులు ఎలాంటి స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా వెసులుబాటు కల్పించింది. ఎలాంటి పత్రాలు లేకపోయినా దరఖాస్తుదారుడి అనుభవంలో భూములు ఉంటే సమగ్ర విచారణతో హక్కులను నిర్ధారించి న్యాయం చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చిన్న, సన్నకారు రైతులు తమకు మంచి రోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు పక్షపాతిగా చెప్పుకొనే సీఎం చంద్రబాబు హయాంలోనే నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందనే ధీమాతో రైతులు ఉన్నారు.



సాగులో ఉన్న సాదా బైనామా భూములు

# కలువాయి ప్రజల కోరిక సీఎం దృష్టికి.. : కురుగొండ్ల

కలువాయి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలన్న మండల ప్రజల కోరికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుపోతానని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండల జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు, వ్యాపారులు, ప్రజలు మంగళవారం వెంకటగిరిలో ఎమ్మెల్యేను కలిసి విన్నతిపత్రం అందజేశారు. కలువాయిని తిరుపతి జిల్లాలో కలిపితే ప్రజలకు దూరాభారంతోపాటు భవిష్యత్తులో సాగునీటి సమస్యలు, వైద్యపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని జేఏసీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నెల్లూరుతో కలువాయి వాసులకు ఎంతో అనుబంధం ఉందని ఇది భవిష్యత్తులో కూడా కొనసాగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లు వారు చెప్పారు. ప్రజల ఆవేదనను సీఎం దృష్టికి తీసుకుపోయి కలువాయిని నెల్లూరులో ఉంచేదానికి తన వంతు ప్రయత్నం చేస్తానని జేఏసీ నాయకులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

● రిలే నిరాహార దీక్షలు

కలువాయిని తిరుపతి జిల్లాలో కలపొద్దు కోరుతూ మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో బస్టాండులో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. రాజకీయ నాయకులు. వ్యాపారులు, ప్రజలు ఉదయం నుంచి నిరాహార దీక్షలో కూర్చున్నారు. ప్రజల గోడు ప్రభుత్వం పట్టించుకునే వరకు ఈ దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించి నెల్లూరులోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



ఎమ్మెల్యే కురుగొండ్లకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

# రాష్ట్ర కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా పెదకూరపాడులో బుధవారం నుంచి జరిగే 51వ ఆంధ్రరాష్ట్ర జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పీ హరీష్, గంటా సతీష్ తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. బాలుర విభాగంలో 14 మందిని, బాలికల విభాగంలో 14 మందిని ఎంపిక చేశామని చెప్పారు. రాష్ట్ర పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు పీ శ్రీనాథ్, పీ హరికృష్ణ, మేనేజర్లు పీ సందీప్, ఆర్ లత పాల్గొన్నారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

# జిల్లాల విభజనతో జలవివాదం : సీపీఎం

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్విభజన పేరుతో కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలిపితే జలవివాదం ఏర్పడే అవకాశం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం జిల్లా విభజన సందర్భంగా తీవ్రమైన అన్యాయం చేసిందని, శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం, శ్రీసిటీ, సిలికా గనులు వంటివి పక్క జిల్లాకు వెళ్లాయన్నారు. ఇప్పుడు కండలేరు జలాశయం తిరుపతి జిల్లాకు వెళ్లిపోతే జలవివాదం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఈ చర్యలను ప్రభుత్వం విరమించుకోవా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మంగళం పుల్లయ్య, రెహనాబేగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్,తదితరులు

## సైదాపురం రోడ్లకు 12.4 కోట్ల మంజూరు

గూడూరు అర్బన్(సైదాపురం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రోడ్ల నిర్మాణాలకు రూ 12.4 కోట్లు మంజూరైనట్లు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు తెలిపారు. మంగళవారం స్థానిక సొసైటీ భవనంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైదాపురం, పోదలకూరు రోడ్డుకు రూ 10 కోట్లు, అలాగే ఊటుకూరు, పెరుమాళ్లపాడు రోడ్డుకు రూ 2.4 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు వివరించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు, సురేంద్ర, రమణయ్య నాయుడు, కోటయ్య నాయుడు, రాఘవరెడ్డి, కె వెంకటటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు

# రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● మోడరన్ విలేజ్‌గా వెంకన్నపురం ● రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

● ప్రజా సమస్యలపై అధికారులతో కలెక్టర్, కృష్ణయ్య సమీక్ష

కొడవలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పీ. కృష్ణయ్య అన్నారు. మండలంలో వెంకన్నపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన కలెక్టర్ హిమాన్షుశుక్లాతో కలిసి మంగళవారం సందర్శించారు. వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ హాలులో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, డ్వామా, తదితర శాఖల్లో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రానికి పెద్దఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, దీంతో నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఆర్థికంగా రాష్ట్రం పురోగమిస్తుందన్నారు. చదువుకున్న యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారికి విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వెంకన్నపురం గ్రామాన్ని అధునాతనంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. త్వరలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు.

● సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా శ్రమించాలి: కలెక్టర్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి. కృష్ణయ్యను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఎంపీడీవో సుబ్బారావు, తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య, కలెక్టర్ హిమాన్షు శుక్లా

# స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్స్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ అపరేషన్స్ నిర్వహిస్తున్నామని, ఇందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశం మంగళవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో జరిగింది. ఆమె మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడన్నారు. అలా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యుల సిఫార్సు లేకుండా స్కానింగ్ తీయరాదని చెప్పారు. ఆర్ఎంపీలు స్కానింగ్‌కు సిఫార్సు చేయరాదని, అలా చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్కానింగ్ చేసిన ప్రతీ గర్భిణి వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం జిల్లా సలహా మండలి చైర్మన్ సీహెచ్ కిరణ్ మాట్లాడుతూ భ్రూణ హత్యలు నివారించే విధంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ స్వర్ణలతరెడ్డి, డాక్టర్ నానాజీరావు, డాక్టర్ ఉమామహేశ్వ రి, డెమో కనకరత్నం, ఎన్జీవోలు కవితారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డెమో కనకరత్నం, పక్కన డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, వైద్యాధికారులు



# శాంతిభద్రతలపై నిర్లక్ష్యాన్ని సహించేదిలేదు

● గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి ● జిల్లాలో పలు స్టేషన్ల తనిఖీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠిహెచ్చరించారు. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, పాత నేరస్థులు, పెండింగ్ కేసులు, వరుసగా జరుగుతున్న నేరాలపై ఐజీ ఆరా తీశారు. నేరాలు అధికంగా జరుగుతున్న పోలీసుస్టేషన్ అధికారులపై ఐజీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

● స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

జిల్లాలో కొంతకాలంగా జరుగుతున్న వరుస నేరాల దృష్ట్యా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి మంగళవారం జిల్లాకు వచ్చారు. ముందుగా నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్‌ను ఐజీ ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో వరుసగా జరుగుతున్న నేరాలు, సిబ్బంది గురించి తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సిబ్బందిని వీఆర్‌కు పంపాలని ఆదేశించారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌పై ఐజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌ను తనిఖీలు చేశారు. స్టేషన్ పరిధిలో సవంత్సరం కాలంగా నమోదైన కేసులు, సిబ్బంది వివరాలు, ఇటీవల జరిగిన పెంచలయ్య హత్య కేసు, గంజాయి ముఠాల వివరాలపై ఆరా తీశారు. అనంతరం రాపూరు స్టేషన్‌ను తనిఖీ చేశారు. తదుపరి పెంచలకోనలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసు కార్యాలయంలో ఐడీ పార్టీ సిబ్బంది, జీడీలు, క్రైమ్ పార్టీలతో సమావేశమయ్యారు.

● శాంతి భద్రతల పరిరక్షణకు ప్రణాళిక

ఈ సందర్భంగా ఐజీ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. గంజాయి సేవించే వారు, అమ్మేవారిపై కఠినంగా కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, రోడ్డు భద్రత నియమాల గురించి వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సోషల్ మీడియా ద్వారా మహిళలను, వ్యాపారులను, సెలబ్రిటీలను బ్లాక్‌మెయిల్ చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఐజీ వెంట ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.



వేదాయపాళెం స్టేషన్ పోలీసులతో మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి

## రేపు విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పీవోఏ చట్టం అమలు కోసం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం, మాన్యువల్ స్కావెంజర్స్ కమిటీ సమావేశాలు గురువారం జరుగుతాయని ఎస్సీ సంక్షేమశాఖాధికారి శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశాలు కలెక్టర్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరుగుతాయని తెలిపారు.

## విద్యుత్తు ఏడీఈ రమేష్‌బాబుకు పదోన్నతి

కోవూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్తు ఏడీఈ రమేష్‌బాబు అనంతపురం జిల్లా పుట్టపర్తి డిప్యూటీ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారు. రమేష్‌బాబు ఇనమడుగు ఏఈగా విద్యుత్తుశాఖలో చేరి అంచెలంచలుగా డీఈగా పదోన్నతి పొందారు. విడవలూరు మండలం ఊటుకూరుకి చెందిన ఆయన చాలాకాలం కోవూరు సర్కిల్‌లో పనిచేశారు.

# పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు

● ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకటసుబ్బయ్య ● 'కౌశల్' విజేతలకు బహుమతులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పోటీతత్వంతో రాణిస్తేనే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం కౌశల్ పరీక్షల జిల్లాస్థాయి విజేతల బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు కౌశల్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. వీటితో పోటీతత్వం, ప్రశ్నించే గుణం అలవాటవుతాయన్నారు. కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ భక్తవత్సల బాబు నాయుడు మాట్లాడుతూ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్, రీల్స్ తయారీ అంశాల పై పాఠశాల స్థాయి, జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ పోటీలు నిర్వహించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 700 మందికిపైగా విద్యార్థులు పాల్గొనగా ఆరుగురు ప్రథమ, ఆరుగురు ద్వితీయ స్థానాలను సాధించారని తెలిపారు.

**విజేతలు వీరే...**

జిల్లాస్థాయి కౌశల్ పోటీ క్విజ్ విభాగంలో బ్రహ్మదేవం జడ్పీ పాఠశాలకు చెందిన నిహారిక, బ్రాహ్మణక్రాకకు చెందిన ధరిత్రి, వీ రేవంత్ కుమార్ ప్రథమ స్థానం, నెల్లూరులోని కేఎన్ఆర్ పాఠశాలకు చెందిన జోష్ణవి, బ్రహ్మదేవంకు చెందిన చందన్ పవన్, వింజమూరుకు చెందిన గురు విఘ్నేష్ ద్వితీయ స్థానం సాధించారు. పోస్టర్ విభాగంలో బ్రాహ్మణక్రాక పాఠశాలకు చెందిన జాన్‌వెస్లీ, మన్విత ప్రథమ, తరుణవాయికి చెందిన ప్రవీణాష్, మనుబోలుకు చెందిన శ్రీకావ్య ద్వితీయ స్థానం సాధించారు. రీల్స్ విభాగంలో వింజమూరుకు చెందిన వీరేంద్రరెడ్డి ప్రథమ, అమ్మవారి పాళేనికి చెందిన నవదీప్ ద్వితీయ స్థానం సొంతం చేసుకున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.1500, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.1000 చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అంద చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంవో సుధీర్‌బాబు, కౌశల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ హరిబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో అధికారులు

## తడిసిన బియ్యం పంపిణీ

సంగం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు గిరిజన కాలనీ రేషన్ దుకాణంలో కార్డుదారులకు తడిసిన బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇటీవల దిత్వా తుపాన్ వల్ల దుకాణంలో వేసిన బియ్యం బస్తాలు తడిసిపోయాయి. దీంతో డీలర్ రేషన్ లబ్ధిదారులకు తడిసిన బియ్యాన్నే పంపిణీ చేస్తున్నాడు. లబ్ధిదారులు ప్రశ్నిస్తే 'ఉన్నది తడిసిన బియ్యమే.. ఇష్టం ఉంటే తీసుకోండి.. లేకుంటే వెళ్లిపోండి' అని డీలర్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మంచి బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

**బంగారం, వెండి ధరలు**



| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ. 12283 |
| వెండి కిలో ధర | రూ. 184500 |
| వెండి ఒక గ్రాము | రూ. 189.50 |

## పాఠశాలకు మైక్రో స్కోప్ వితరణ



మైక్రో స్కోప్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సంగం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాలకు మైక్రో స్కోప్‌ను అందజేశారు. విద్యార్థుల ప్రయోగాల కోసం పూర్వ విద్యార్థులు జి వెంకటరమణయ్య, కె ప్రతాప్‌లు స్వంత నిధులు వెచ్చించి మైక్రో స్కోప్‌ను వితరణ చేయడంతో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

## వంద రోజుల ప్రణాళిక పక్కాగా నిర్వహించాలి

ఉదయగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వంద రోజుల ప్రణాళిక ప్రత్యేక తరగతులను పక్కాగా నిర్వహించాలని ఎంఈవో-1 వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బీసీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదివి నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని షేక్ నూర్జహాన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సాదాబైనామాలను క్రమబద్ధీకరించుకోండి

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎవరైనా భూములను అగ్రిమెంట్ పద్ధతిలో కొనుగోలు చేసి ఉంటే వాటిని సాదాబైనామా కింద క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దారు యనమల నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీటి కాల పరిమితిని 2027 డిసెంబరు 31 వరకు ఉందని తెలిపారు. అర్హులైన రైతులు సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రెడ్లదిన్నెలో పశు వైద్య శిబిరం

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్లదిన్నెలో రాష్ట్రీయ గోకుల మిషనన్ పథకం కింద మంగళవారం జిల్లా పశు గణాభివృద్ధి సహకారంతో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భకోశ, ప్రస్తుత సీజన్‌లో పశువులకు సోకే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పలు పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగాణాభివృద్ధి శాఖ విస్తరణాధికారి శ్రీనివాస రావు, పశు వైద్యులు సురేష్‌బాబు, రాఘవేంద్ర శర్మ, మధు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## ఉదయగిరిలో వీపీఆర్ నేత్ర..

ఉదయగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవపాళెంలో మంగళవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర బస్సు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 300 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 161 మందికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీపీఆర్ ఫౌండేషన్ చీఫ్ కో-ఆర్డినేటర్ ఎస్.శంకర్, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ

చేజర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి). ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిపుణులచే తయారు చేయించిన మోడల్ టెస్ట్ పేపర్లను మంగళవారం చేజర్ల మండల యూటీఎఫ్ శాఖ ప్రతినిధులు విద్యార్థులకు పంపిణీ చేశారు. దాతలు, యూటీఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించేందుకు మోడల్ టెస్ట్ పేపర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు కృష్ణారెడ్డి రవిబాబు, సుబ్రమణ్యం, బుజ్జయ్య, సునీల్, మస్తాన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నేతకు పితృ వియోగం



ఆత్మకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, రావులకొల్లు మాజీ సర్పంచి రామిరెడ్డి మోహన్‌రెడ్డి తండ్రి పెద్దమస్తానయ్య(78) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఆత్మకూరు మండలం రావులుకొల్లులో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, పలువురు టీడీపీ నేతలు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఖాళీ స్థలాలు...'రోగ' కారకాలు..!

**● చిట్టడవులను తలపిస్తున్న ముళ్లపొదలు ● దోమలు, విష పురుగులకు ఆవాసాలు**

ఆత్మకూరు, డిసెంబరు 9 ( ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపాలిటీ పరిధిలో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు విష పురుగులు, దోమలకు ఆవాసాలుగా మారాయి. కొన్ని ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో కొందరు పశువులు, ఇతరవాటిని పెంచుతూ వాటి వ్యర్థాలను అక్కడే వేస్తుండడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండడంతో ఆ ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రస్తుతం పట్టణవాసులు సీజనల్ వ్యాధుల బారినపడి ఇబ్బందులు పడుతున్నారు. జనావాసాల మధ్య ఖాళీ స్థలాలు ప్రమాదకరంగా మారడంతో అధికారులు నోటీసులు జారీ చేసినా యజమానులు ఖాతరు చేయడం లేదు.

**● డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి...**

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని జెఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, ప్రియదర్శినినగర్, ఆర్టీసీ డిపో సమీపంలో తదితర ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఖాళీ స్థలాలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. యజమానుల పర్యవేక్షణ లేకపోవడంతో డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. దానికితోడు ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో పరిసర ప్రాంత ప్రజలు మురికి నీరు అందులోకి వదులుతుండడంతో మురికి కూపాలుగా మారుతున్నాయి. గుబురుగా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.



దోమలకు నిలయంగా ఉన్న ఖాళీస్థలాలు

ఖాళీ స్థలాల్లో పడేసిన కొబ్బరిబొండాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ సామగ్రి, పాత టైర్లు ఏళ్ల తరబడి వాననీటిలో మురిగిపోతున్నాయి. వర్షాకాలంలో ఇక్కడ దోమల బెడద పెరిగి డెంగీ, మలేరియా వంటి ప్రమాదకరమైన వ్యాధులకు కారణమవుతున్నాయి. దోమల కారక లార్వాలు ఖాళీ స్థలాల్లోని మురికినీటిలో అలాగే ఉండిపోతున్నాయి. వాతావరణంలో మార్పులు రాగానే ఇవి విజృంభిస్తున్నాయి. ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు.

## యూటీఎఫ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ప్రతిజ్ఞ చేస్తున్న యూటీఎఫ్ నూతన కమిటీ సభ్యులు

సీతారామపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవ అయ్యింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహాసభ మండల శాఖ అధ్యక్షుడు భోగ్యం శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సభలో గౌరవాధ్యక్షుడుగా షేక్ గాజుల రంతుజాని, అధ్యక్షుడుగా ఎం.మహేష్, సహ అధ్యక్షులుగా షబ్బీర్ అహ్మద్, శాంతి, ప్రధాన కార్యదర్శిగా గొడ్లవేటి వెంకటేశ్వర్లు, కోశాధికారి సారె సురేష్, కుటుంబ సంక్షేమ నిధి కార్యదర్శిగా ఓంకారం నరసింహరాజు, మహిళా కార్యదర్శిగా పీపీపీ కుమారి, కార్యాలయ కార్యదర్శిగా బీసీ వెంగయ్య, జిల్లా కౌన్సిలర్లుగా పేరాల శ్రీనివాసులు, దోరశిల వెంకటేశ్వర్లు, అన్నంగి ప్రసాదులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వేతన కమిషన్‌ను వెంటనే నియమించి సంక్రాంతి కానుకగా 29 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో యూరియా



మారంరెడ్డిపల్లి సొసైటీలో ఉన్న యూరియా

సీతారామపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు తగినంత యూరియా అందుబాటులో ఉందని మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ అన్నారు. మారంరెడ్డిపల్లి సొసైటీలో మంగళవారం సొసైటీ చైర్మన్ రాజశేఖర్, డైరెక్టర్లు రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో 400 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, మండల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. యూరియాను అధిక మోతాదులో వాడటం పంటకు మంచిది కాదని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే వాడాలని తెలిపారు.

## ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



రోడ్డుపై నిలిపిన వాహనాలను తొలిగిస్తున్న ఎస్ఐ షేక్ జిలాని

ఆత్మకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ షేక్ జిలానీ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి సత్రం సెంటర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న వాహనాలను తొలిగించారు. రోడ్డుకు ఇరువైపుల దుకాణాల వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాలను ఉంచాలని వాహనదారులకు సూచించారు. ఆటోలు, ఇతర వాహనాలను రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా వాహనాలను రోడ్డుకు అడ్డంగా ఉంచితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అనకాలువలో పూడికతీత పూర్తి

అనంతసాగరం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాగరం చెరువు పరిధిలోని అనకాలువలో పూడికతీత పనులకు ఇరిగేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. రైతులకు నీటి సమస్య రాకుండా చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాఘురు సుబ్బారెడ్డి సమస్యను మండల టీడీపీ అధ్యక్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సమస్యను మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వివరించి, ఇరిగేషన్ శాఖ ద్వారా 5 కి.మీ మేర పూడికతీత పనులు చేపట్టారు. ప్రస్తుతం కాలువలో నీరు సాఫీగా ప్రవహిస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## మినగల్లు సచివాలయం తనిఖీ

అనంతసాగరం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు సచివాలయాన్ని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూడాలని ఆదేశించారు. ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంపీడీవో షానవాజ్ ఉన్నారు.

## నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

ఆత్మకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శివకేశ్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణీకులు 9959225645 నెంబరుకు ఫోన్ చేసి మెరుగైన సేవల కోసం సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

## మెగా జాబ్‌మేళాలో 92 మంది ఎంపిక

నెల్లూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ పీజీ కళాశాలలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. కాగా, ఈ మేళాలో 17 సంస్థలు పాల్గొన్నాయి. 171 మంది అభ్యర్థులు హాజరుకాగా 92 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

## కళాశాలకు ఆర్వో పరికరాల వితరణ



కళాశాలలో ఆర్వో పరికరాలు అందజేసిన పూర్వ విద్యార్థులతో ప్రిన్సిపాల్

ఉదయగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అమెరికాలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థి జీ.కొండారెడ్డి రెండు అల్కలైన్ ఆర్వో తాగునీటి పరికరాలను మంగళవారం కళాశాలకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉసర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలలో 1992-94లో విద్యనభ్యసించిన కొండారెడ్డి రూ.35 వేలు విలువ చేసే రెండు ఆర్వో పరికరాలను అందజేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. కళాశాలలో చదువుకుని ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ప్రతిఒక్కరు వారు చదువుకున్న విద్యాసంస్థలకు సహాయం చేయడం మంచి సాంప్రదాయమన్నారు. ఈ సందర్భంగా కొండారెడ్డికి ప్రిన్సిపాల్ తోపాటు అధ్యాపకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అర్షద్, తాహెర్, గౌస్‌బాషా, సురేష్ పాల్గొన్నారు.

## పన్నులు చెల్లించండి



బకాయిదారులతో చర్చిస్తున్న పంచాయతీ అధికారులు

ఉదయగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇంటి, కుళాయి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రావు కోరారు. మంగళవారం పంచాయతీ సిబ్బందితో కలిసి పట్టణంలోని పన్ను బకాయి ఉన్న ఇళ్లకు వెళ్లి యజమానులతో చర్చించి పన్నులు చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో రూ.19 లక్షల వరకు పన్ను బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిదారులు నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించాలని యజమానులకు సూచించినట్లు తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో పన్ను బకాయిలు చెల్లించకపోతే కుళాయి కనెక్షన్లు నిలుపుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ కరీముల్లా, డీఈవో బాబు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి మదన్‌మోహన్

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంటలకు సోకే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెడ్డుపాడు, దుత్తలూరు-2 రైతుసేవా కేంద్రాల పరిధిలో సాగులో ఉన్న పంటలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంద్యాల జొన్న, శనగ పంటలకు కాండం తొలుగు, వేరుకుళ్ల తెగుళ్ల గుర్తించి రైతులకు నివారణ చర్యలు సూచించారు. డ్రోన్ సహాయంతో పురుగుమందుల పిచికారిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ దినేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ షేక్ ఖాదర్‌వలి

ఆత్మకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, నివారణ చర్యలను చేపట్టాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ షేక్ ఖాదర్‌వలీ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి గళ్ల పరీక్ష చేయించాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 21 నుంచి 23 వ తేదీ వరకు జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అస్మా, ఎంపీహెచ్ఈవో సుధాకర్, పద్మావతమ్మ, సీహెచ్ సుధాకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లూరులో రైల్వే ఆసుపత్రి ఏర్పాటు చేయండి

**● కేంద్ర మంత్రికి ఎంపీలు వేమిరెడ్డి, బీద విజ్ఞప్తి**

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో పూర్తి స్థాయి రైల్వే వైద్యశాలను ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఢిల్లీలో కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి రోజుకు రమారమి 22వేల మంది ప్రయాణిస్తున్నారని, స్టేషన్ మీదుగా 110 రైళ్లు నడుస్తున్నాయని తెలిపారు. స్టేషన్ అభివృద్ధికి ఇప్పటికే రూ.102 కోట్ల నిధులు విడుదలయ్యాయని వారు వివరించారు. అయినా జిల్లా కేంద్రంలో రైల్వే వైద్యశాల లేకపోవటంతో ఉద్యోగులు, పింఛన్‌దారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తమ విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీలు తెలిపారు.

## లార్వా దశలోనే దోమలను నివారించాలి

**● జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ**

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లార్వా దశలోనే దోమలను నివారించాలని, తద్వారా ప్రాణాంతక వ్యాధులను అరికట్ట వచ్చని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ ఆదేశించారు. మంగళవారం నగరంలోని కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆశాల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఆశాలు ప్రతీరోజూ ఇంటింటికి తిరిగి నీటి నిల్వలను పరిశీలించి రోజుల తరబడి నిల్వ ఉన్న నీటిని పార బోయాలన్నారు. ఫ్రైడే.. డ్రైడే విధానాన్ని తప్పక పాటించాలని సూచించారు. మలేరియా నిర్ధారణకు రక్త పూతలు సేకరించి ల్యాబ్‌కు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునపురం, రాజాగారివీధి, చాకలివీధి పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది, మలేరియా విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పాముకాటుతో వ్యవసాయ కూలీ మృతి



మృతి చెందిన రాజశేఖర్

జలదంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెంలో పాము కాటుకు వ్యవసాయ కూలీ మైనంపాటి రాజశేఖర్(42) మృతి చెందారు. మంగళవారం ఉదయం వ్యవసాయ పొలంలో వరినాట్లు పనులకు వెళ్లిన రాజశేఖర్ నారుమడి కుప్పల నుంచి వరి నారు కట్టలు తీసుకెళ్లే క్రమంలో కట్టల్లో ఉన్న పాము రాజశేఖర్ కాలుపై కాటేసింది. దీంతో తోటి కూలీలు హుటాహుటిన ఆయనను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబపోషకుడు మృతి చెందడంతో ఆ కుటుంబం బందిక్కుతోచని స్థితిలో శోకసముద్రంలో మునిగిపోయింది. మృతుడికి భార్య రాజితమ్మ, కుమార్తెలు భార్గవి, రోజ్‌మేరి ఉన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ముత్తుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మదేవం సమీపంలోని బుడ్డి డ్రైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (45) మంగళవారం లభ్యమైంది. బుడ్డి డ్రైన్‌కు మరమ్మతులు చేస్తుండగా కాలువ మధ్యలో మృతదేహం తేలడంతో స్థానికులు వీఆర్వోకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ముత్తుకూరు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మూడు, నాలుగు రోజుల క్రితం కాలువలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. సమాచారం తెలిసిన వారు పోలీసులకు వివరాలు తెలియజేయాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం) డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో గాంధీ బొమ్మ సమీపంలోని సండే మార్కెట్ స్వతంత్ర పార్కు వద్ద పార్క్ చేసిన బైక్‌ను గుర్తుతెలియని దుండగులు దోచుకెళ్లిన ఘటనపై చిన్న బజారు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు నగరంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన భాస్కరుని సురేంద్రబాబు ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 3వ తేదీ సాయంత్రం స్వతంత్ర పార్క్‌కు బైక్‌పై వెళ్లారు. అక్కడ వాహనం పార్క్ చేసి లోపలికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పట్టపగలే నగలు చోరీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఇంట్లోని బీరువాలో నగలు చోరికి గురైన ఘటనపై చిన్నబజారు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని మూలాపేట ఈఎస్ఆర్ఎం స్కూల్ సమీపంలో గుజరాతీ అనే మహిళ కుటుంబం నివసిస్తోంది. గత నెల 15వ తేదీ మధ్యాహ్నం ఆమె ఇంట్లోని బీరువాలో పెట్టిన 8 సవర్ల బంగారు నగలు కనిపించలేదు. పక్కింట్లో ఉండే పుష్ప అనే మహిళ తరచూ వారి ఇంటికి వస్తుండేదని, ఆమే నగలు అపహరించి ఉంటుందని బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్కడ ఒక్కరు.. ఇక్కడ ఇద్దరు!

**● ఉద్యోగుల్లో మారని తీరు**
**● సచివాలయాల్లో అందని సేవలు**



జీ.కొండారెడ్డిపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీసు



గుడినరవలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉద్యోగులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అడిగేవారు లేరులే అన్న ధీమానో.. లేక ఎవరేమనుకున్నా డోంట్ కేర్.. అనుకున్నారో ఏమో గానీ.. సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరిపై అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ వారిలో ఎలాంటి మార్పు కనిపించడమే లేదు. జిల్లా కేంద్రానికి శివారు ప్రాంతాలు కావడంతో వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో అలాంటి పరిస్థితి మరింత దారుణంగా కన్పిస్తోంది. జిల్లా కేంద్రానికి సుమారు వంద కి.మీ పైబడి దూరం ఉండడంతో ఉన్నతాధికారుల తనిఖీలు ఉండవనే ఉద్దేశంతోనే ప్రతినిత్యం కొంతమంది ఉద్యోగులు ఎంచక్కా విధులకు ఎగనామం పెడుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన మండల స్థాయి అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడక పోవడంతోనే తాము ఆడిందే ఆట, పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం వరికుంటపాడులోని జీ.కొండారెడ్డిపల్లి సచివాలయంలో మధ్యాహ్నం 1 గంట వరకు కేవలం మహిళా పోలీసు మాత్రమే విధుల్లో ఉన్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. అలాగే తామేమి తక్కువ కాదన్నట్లు ఉదయగిరిలోని గుడినరవ సచివాలయంలోనూ వెటర్నరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు మాత్రమే విధుల్లో ఉండడం విశేషం. అంతవరకు మిగిలిన ఉద్యోగులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వారి కోసం గంటల తరబడి ఎదురు చూసిన ప్రజలు చేసేదేమిలేక నిరాశగా వెళ్లిపోవడంతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు లేక ఆ సచివాలయాలు బోసిపోయాయి. కొంతమంది ఏకంగా విధులకు ఎగనామం పెడుతుండగా, మరి కొంతమంది ఫీల్డు, మీటింగుల పేరుతో ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. వీరికితోడు కనీసం జీ.కొండారెడ్డిపల్లిలోని విలేజ్ హెల్త్ క్లినిక్ తలుపులు తెరుచుకోక పోవడం చూస్తుంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కోదండరాముడి ఆలయ భూముల పరిశీలన



ఆలయ భూముల మ్యాపును పరిశీలిస్తున్న జిల్లా దేవదాయశాఖాధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచేడు రెవెన్యూ గ్రామంలోని కావేటిపల్లం ప్రాంతానికి చెందిన బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో కొలువైవున్న సీతా,లక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి చెందిన కావేటి పల్లంలోని వ్యవసాయ భూములను దేవాదాయశాఖ, రెవెన్యూ, సర్వే అధికారులు మంగళవారం పరిశీలించారు. టైటిల్ డీడ్ నెంబరు 1888లోని బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో కొలువైవున్న సీతా, లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారి ఆలయానికి చెందిన సుమారు 452.05 ఎకరాలు భూములను పరిశీలించి రైతులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయశాఖలోని ఆలయ భూములను పరిశీలనలో భాగంగా కోదండరామస్వామి ఆలయ భూములు పరిశీలించినట్లు తెలిపారు. తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున, మండల సర్వేయర్ సోమేశ్వరరావు, వీఆర్వో జైశీల పాల్గొన్నారు.

**చికెన్ ధరలు**
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 150 |
| స్కిన్ చికెన్ | 270 |
| స్కిన్‌లెస్ | 294 |

కోడిగుడ్ల ధర (100): 670

## సాదాబైనామా గడువు పొడిగింపు

అల్లూరు/కలిగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భూములకు సరైన రికార్డులు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభ వార్త చెబుతూ సాదాబైనామా ప్రక్రియ గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని అల్లూరు తహసీల్దారు లక్ష్మీనారాయణ, కలిగిరి తహసీల్దారు గిరీష్‌కుమార్‌లు మంగళవారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. దీనిని అనుసరిస్తూ 2024 జూన్ 15కు ముందు వరకు కేవలం తెల్ల కాగితాల ఆధారంగా కొనుగోలు చేసిన భూముల రికార్డులను సరిచేస్తూ నిర్వర్తించే సాదాబైనామా ప్రక్రియను మరో రెండేళ్ల 2027 డిసెంబరు 31 వరకు పొడిగించిందని పేర్కొన్నారు. అగ్రిమెంటు ఆధారంగా కొనుగోలు చేసిన భూములు కలిగిన రైతులు ఫారం-10 నమూనాలో సమీప సచివాలయం లేదా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో పరిష్కారం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన కరువు!

● అధికారుల అంచనాలు తలకిందులు ● 5 వేల దరఖాస్తులు వస్తాయనుకుంటే 500 వచ్చాయి

కావలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విచ్చలవిడిగా వేసిన అక్రమలేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్‌ఆర్‌ఎస్‌పై అధికారులు, పాలకుల అంచనాలు తారుమారయ్యేట్లు కనిపిస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో సుమారు 816 ఎకరాలలో 124 అక్రమ లేఅవుట్లు వెలసి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటన్నింటిని క్రమబద్ధీకరిస్తే సుమారు రూ.150 కోట్లు మున్సిపాల్టీకి ఆదాయం వస్తుందని తొలుత అంచనా వేశారు. అయితే క్షేత్రస్థాయిలో నిర్ణీత గడువు లోపల క్రమబద్ధీకరణకు స్పందన రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఏడాది జనవరి 23 వరకు క్రమబద్ధీకరణ గడువును పెంచింది. ఇలా గడువు పెంచినా రియల్టర్లలో, ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో పెద్దగా స్పందన కానరాలేదు. దీంతో అధికారులు అక్రమ లేఅవుట్లలో సుమారు 10 వేల ప్లాట్లు ఉండగా వాటిల్లో సగం 5 వేలు ప్లాట్లు క్రమబద్ధీకరణకు వస్తాయని తద్వారా రూ.80 కోట్ల వరకు ఆదాయం వస్తోందని భావించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 500 ప్లాట్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. వచ్చిన దరఖాస్తులలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్ని క్రమబద్ధీకరణ అవుతాయో తెలియక పోవడంతో ఎల్‌ఆర్‌ఎస్‌పై అధికారుల అంచనాలన్నీ తారుమారయ్యాయి.

● ఫలించని అక్రమ లేఅవుట్లపై అధికారులు కొరడా

గత వైసీపీ ప్రభుత్వంలో కావలిలో వేసిన అక్రమ లేఅవుటలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే అక్రమ లేఅవుట్లలో రాళ్లు తొలగించి కొరడా ఝుళిపించారు. అలాగే అక్రమ లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా ఆపేశారు. దీంతో కావలిలో ఒక్క సారిగా రియల్ ఎస్టేట్ వ్యాపారం డమాల్‌మంది. ఈ క్రమంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఎలా పుంజుకుంటుందా అని ఆందోళన చెందుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోవడంతో రిజిస్ట్రేషన్ ఫీజులు, వివిధ పన్నుల రూపేణ ప్రభుత్వాని వచ్చే ఆదాయం కూడా తగ్గిపోయింది. దీంతో రాష్ట్రప్రభుత్వం రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ద్వారా ప్రభుత్వానికి ఎలా ఆదాయం సమకూర్చుకోవాలనే ఆలోచన చేసింది. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకు వచ్చింది. దీంతో అక్రమలేఅవుట్లు క్రమబద్ధీకరణతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతోందని భావించారు. అయితే అక్రమ లేఅవుట్లలో వేసిన ప్లాట్లు అన్నీ ఇప్పటికే రియల్టర్లు అమ్ముకోవడంతో వారు తమకేమి సంబంధం లేదని పట్టించుకోవడంలేదు. ఇకపోతే రియల్‌ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోవడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కూడా ఎల్‌ఆర్‌ఎస్‌కు ఇప్పుడు అదనంగా డబ్బులు చెల్లించడానికి ఆసక్తి చూపటంలేదు. ఎల్‌ఆర్‌ఎస్‌లో అక్రమ ప్లాట్లు క్రమబద్ధీకరించుకోకపోతే భవిష్యత్తులో వచ్చే ఇబ్బందుల గురించి ప్రచారం చేసినా స్పందన లేదు.


కావలి మున్సిపాలిటీ పరిధిలో వేసిన అక్రమ లేఅవుట్

● ప్రభుత్వ చట్టాలపై నమ్మకం లేకనే...

ప్రభుత్వ చట్టాలపై నమ్మకం లేకనే ఎల్‌ఆర్‌ఎస్ పట్ల రియల్టర్లు, ప్లాట్ల కొనుగోలు దారులు స్పందించడంలేదని తెలిసింది. అక్రమ లేఅవుట్లలో క్రయవిక్రయాలు, భవన నిర్మాణాలకు అనుమతులు భవిష్యత్తులో కూడా ఉండవనే భయం ఉంటే ఎల్‌ఆర్‌ఎస్‌పై స్పందించే వారు. ప్రభుత్వాలు మారినపుడల్లా చట్టాలు మారుస్తుండటంతో ఈ చట్టం ఎంత కాలం ఉంటుందిలే అనే భావన రియల్టర్లలో ఉంది. ఎంతకాలం భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా ఉంటారు.. ఎప్పుడో ఒకప్పుడు మళ్లీ చట్టం మార్పు చేస్తారనే ఉద్దేశంతో ఉన్నారు. చెరువులలో, రోడ్ల వెంబడి కట్టుకున్న ప్రభుత్వ స్థలాలలోనే భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తుంటే డబ్బులు పెట్టి కొనుగోలు చేసుకున్న ప్లాట్లలో అనుమతులు ఇవ్వక ఎక్కడికి పోతారనే భావం రియల్టర్లు, ప్లాట్ల కొనుగోలు దారులలో ఉండటంతో ఎల్‌ఆర్‌ఎస్ ఆశించిన ఫలితాలు ఇవ్వలేక పోతుంది.

## రెడ్‌క్రాస్‌కు రూ.లక్ష విరాళం

● డాక్టర్ రవికుమార్, విజయ దంపతులకు సన్మానం


కావలి రెడ్‌క్రాస్‌కు రూ.లక్ష విరాళం అందచేస్తున్న డాక్టర్ రవికుమార్, డాక్టర్ విజయ దంపతులు

కావలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా డేకేర్ సెంటర్ నిర్వహణ కోసం డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ విజయ దంపతులు రెడ్‌క్రాస్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు. రవికుమార్, విజయల 43వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రెడ్‌క్రాస్‌లో జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి ఆరికట్ల మధుసూధనరావుకు రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, రెడ్‌క్రాస్ బాధ్యులు కే.హరినారపరెడ్డి, మద్దుల నరసింహారావు, డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ రమ్య, జనిగర్ల మనోహర్, నల్లిపోగు ప్రణీత్, బెజవాడ ప్రసన్న కుమార్, కలికి శ్రీహరి రెడ్డి, గాదిరెడ్డి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కోటి సంతకాలకు ప్రజా స్పందన

కావలి(టౌన్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజాస్పందన లభించిందని వైసీపీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వైసీపీ నేతలు గంధం ప్రసన్న, గుడ్లూరు మాల్యాద్రిలు మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య ఉచితంగా అందించాలన్న సంకల్పంతో తమ నేత జగన్ 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను స్థాపించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని ప్రైవేట్‌పరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ఈ సమావేశంలో నేతలు కనమర్లపూడి నారాయణ, షాహుల్‌హమీద్, కుందుర్తి శ్రీనివాసులు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌టవర్ల నిర్మాణాలకు స్థలం కేటాయించాలి


జేసీ మొగలి వెంకటేశ్వర్లుకు మొక్క అందజేతస్తున్న జిల్లా టెలికాంబోర్డు డైరెక్టర్ తాటికొండ అనూష, తదితరులు

కొండాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గంలో మంజూరైన 21 బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణాలకు త్వరితగతిన స్థలం కేటాయించాలని జిల్లా టెలికాం బోర్డు డైరెక్టర్ తాటికొండ అనూష జాయింట్ కలెక్టర్ మొగలి వెంకటేశ్వర్లును కోరారు. మంగళవారం ఆమె నెల్లూరు కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టవర్ల నిర్మాణాలకు స్థలాన్ని కేటాయిస్తూ పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరానన్నారు.

## ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి


గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

దగదర్తి(బిట్రగుంట), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆర్థిక, ఆరోగ్యాభివృద్ధికై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు సూచించారు. దగదర్తి మండలం తడకలూరు పంచాయతీ ఎస్టీకాలనీలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి అన్వేష్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఇటీవల దిత్వా తుఫాన్ నేపథ్యంలో సైక్లోన్ రిలీఫ్ సెంటర్లకు తరలించిన గిరిజనులకు ప్రభుత్వం అందచేసిన నగదుపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య విషయంలో అశ్రద్ధగా వ్యవహరించకూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు.

## ఆర్టీసీకి 130 ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత


ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేస్తున్న డాక్టరు నవీన్

కందుకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు డిపోలో ఉన్న ఆర్టీసీ బస్సులన్నింటిలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో పట్టణంలోని ప్రణవి చిన్నపిల్లలు, కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టరు నవీన్ 130 ఫస్ట్ ఎయిడ్ కిట్లును బహూకరించారు. మంగళవారం డీఎం రావూరి శ్రీనివాసులుకు వీటిని అందజేశారు. ఇవి ప్రయాణికులకు అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు.



## చెత్త సంపద కేంద్రం స్థలం కబ్జా


అంకభూపాలపురంలో చెత్త సంపద కేంద్రానికి కేటాయించిన స్థలం ఆక్రమించి దుక్కి చేసిన ఆక్రమణదారుడు

వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకభూపాలపురం రెవెన్యూ పరిధిలో చెత్త సంపద కేంద్రానికి కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురైంది. ఆ స్థలంలో దుక్కి దున్ని జామాయిల్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. అంకభూపాలపురంలో చెత్తసంపద కేంద్రం లేకపోవడంతో నాలుగు నెలల కిందట రెవెన్యూ అధికారులు సర్వే నెంబరు 189-3లో 25 సెంట్లు స్థలం గుర్తించి పొజిషన్ ఇచ్చి చెత్తసంపద కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపించారు. చెత్తసంపద కేంద్రం నిర్మాణానికి అనుమతులు కూడా వచ్చాయి. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టాల్సి ఉంది. ఇంతలో ఆ స్థలంను ఆక్రమించి దున్ని జామాయిల్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రానికి కేటాయించిన స్థలంలో ఆక్రమణలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు


తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ లతీఫున్నీసా

జలదంకి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లతీఫున్నీసా పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా మంగళవారం రాత్రి ఎస్ఐ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనచోదకులకు పలు సూచనలు చేశారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా రాత్రి సమయాల్లో పనులు త్వరితగతిన ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. అలాకాకుండా రాత్రివేళల్లో ఆకతాయి వేషాలు వేస్తే చట్టపరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు.

## మద్యం దుకాణంలో చోరీ

వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెంలోని ఎస్‌వీఎస్ వైన్స్ షాపులో చోరీ జరిగింది. వివరాల మేరకు.. సోమవారం రాత్రి 10 గంటలకు సేల్స్‌మెన్ యధావిధిగా దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లి మంగళవారం ఉదయం 10 గంటలకు దుకాణం తీశాడు. దుకాణం రేకులు పైకి లేపి ఉండడాన్ని గుర్తించి యజమానికి సమాచారం ఇచ్చాడు. దుకాణంలో పరిశీలించగా దుడగులు వైన్స్‌షాపు పైన రేకులు పైకి లేపి దుకాణంలోకి వెళ్లి దుకాణంలో ఉంచిన రూ.10 వేల, 4 ఫుల్ బాటిళ్ల మద్యం అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు దుకాణం యజమాని క్రిష్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## పల్స్ పోలియోపై సిబ్బందికి శిక్షణ

కొండాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 21 వ తేదీన జరగనున్న పల్స్ పోలియోపై స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం వైద్యాధికారి నసీరుద్దీన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 5 ఏళ్ల లోపు చిన్నారులు 4501 మందిని గుర్తించామన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పోలియో చుక్కలను చిన్నారులకు వేసే విధానంపై ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఎంఈవో-2 ఆనందరావు, సీహెచ్‌వో చెంచురామయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థిని ఎంపిక

కావలి(టౌన్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కావలి శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థిని టీ.అశ్విని ఎంపికైంది. మంగళవారం పట్టణంలోని పాతూరులో ఉన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో అశ్వినిని కళాశాల యాజమాన్యం అభినందించింది. కరస్పాండెంట్ కే.వెంకయ్య మాట్లాడుతూ పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 అథ్లెటిక్స్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని అశ్విని హేమర్ త్రోలో బంగారు పతకం సాధించి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలవడమేకాక లక్నోలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్ర రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. బాలుర విభాగం హేమర్‌త్రోలో లోకేష్ తృతీయ స్థానం సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లుకోధర్, డైరెక్టర్లు పీఏఎస్ ప్రసాద్, ఎం కొండయ్య, మల్లికార్జునరావు, కన్వీనర్ నందనవనం మధుసూదన్‌రావు, ఏవో స్టాలిన్, పీడీ జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీరోడ్డు బాలుర ఉన్నత పాఠశాల వద్ద లైన్ వర్క్ ఉన్నందున 11కేవీ ఎస్‌బీఐ ఫీడర్‌లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ ఏఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఆఫీసు ఏరియా, గుప్తాస్ ప్లాజా ఏరియా, పోస్టాఫీసు సెంటర్, సుల్తాన్ మొహిద్దీన్ ఆసుపత్రి ప్రాంతవాసులంతా సహకరించాలని కోరారు.

# ఔషధాల నాణ్యతపై నిరంతరం పరిశీలన

● నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డ్రగ్ నియంత్రణ అధికారులు ఔషధాల నాణ్యతపై నిరంతరం పరిశీలన చేస్తారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఫైర్‌స్టేషన్ రోడ్డులో సెల్ఫీ పాయింట్ వెనుక నూతనంగా నిర్మించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి డివిజనల్‌లో 900 ఔషధ దుకాణాలు ఉన్నాయన్నారు. వాటిల్లో నాణ్యత కలిగిన మందులు అమ్ముతున్నారా, కాలం తీరిన మందులు ఉన్నాయా తదితరాలను ఔషధ నియంత్రణ అధికారులు పరిశీలిస్తుంటారన్నారు. ప్రజలకు తాము కొనుగోలు చేసిన మందులపై ఏదైనా అనుమానాలు ఉంటే ఔషధ నియంత్రణ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుని నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కావలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ కావలిలో నూతన కార్యాలయం ఏర్పాటు ద్వారా ఔషధాల నాణ్యత, ఫార్మసీలు తనిఖీ, లైసెన్స్‌లు మంజూరు, ఫిర్యాదుల పరిష్కారం తదితరాలు వేగంగా జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, జనసేన నేత పొబ్బా సాయి, బీజేపీ నేత మాల్యాద్రి, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


డ్రగ్ కంట్రోల్ నూతన కార్యాలయ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

# పక్కా గృహాల కోసం 2109 దరఖాస్తులు

● గృహనిర్మాణ శాఖ ఈఈ మాధవరావు

లింగసముద్రం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఆవాస యోజన గ్రామీణ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని మండలంలో 16మ గ్రామ పంచాయతీల నుంచి 2109 దరఖాస్తులు వచ్చాయని గృహనిర్మాణ శాఖ కందుకూరు ఈఈ ఎం.మాధవరావు చెప్పారు. మంగళవారం ఆయన లింగసముద్రంలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాల కోసం వచ్చిన 1747 దరఖాస్తులను మండల ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉందన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారికి, ఇళ్ల స్థలం ఉండి ఇల్లు కట్టుకుంటాము అన్నవారిని సర్వే చేసి అర్హులుగా చేర్చుతామన్నారు. ఈ పథకం కింద అర్బన్ పరిధిలో ఒక్కో గృహానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షల, రాష్ట్ర ప్రభుత్వం రూ.1లక్ష కలిపి రూ.2.50 లక్షల లబ్ధిదారులకు ఇస్తారన్నారు. రూరల్ పరిధిలోని లబ్ధిదారులకు ఎంత మొత్తం ఇవ్వాలనే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. అలాగే 2014, 2019లో లెంటిల్, బెసిమెంట్, రూఫ్ లెవల్‌లో నిలిచిపోయిన నిర్మాణాల లబ్ధిదారులను ఈ సర్వేలో కలుపుతామన్నారు. అలాగే ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు పీఎంఏవై గ్రామీణ పథకంలో బిల్లులు చెల్లిస్తామని ఆయన పేర్కొన్నారు.


మాట్లాడుతున్న గృహనిర్మాణ శాఖ ఈఈ మాధవరావు

## కావలిని కప్పిన మంచు దుప్పటి


పొగమంచులో చిక్కుకున్న సూర్యభగవానుడు

కావలి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితుల ప్రభావంతో మంగళవారం దట్టమైన పొగ మంచు దుప్పటిలా కావలిని కప్పేసింది. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం మంచు కారణంగా ప్రజలతో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు కూడా చలి తగ్గకపోవడం, మంచుతో జాతీయ రహదారిపై ముందున్న వాహనాలు, ఎదురొచ్చే వాహనాలు సైతం కనిపించక పోతుండడంతో వాహనాలను రోడ్డు పక్కన నిలిపి మంచు తగ్గిన తరువాత వాహనదారులు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

# అభివృద్ధి పథంలో కావలి ఆర్టీసీ డిపో


ఆదర్శ ఉద్యోగులకు చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం ఆదినారాయణ, తదితరులు

కావలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషి కారణంగా కావలి డిపో అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజరు డీ. ఆదినారాయణ తెలిపారు. మంగళవారం కావలి డిపో గ్యారేజీ ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిపో మేనేజరు మాట్లాడుతూ కావలి డిపో గత మాసంలో ఈపీకేలో రీజియన్‌లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. అలాగే జీరో బ్రేక్ డౌన్, జీరో కంప్లెయింట్స్ సాధించిందన్నారు. ఇది ట్రాఫిక్, మెకానికల్ సిబ్బంది సమష్టి కృషి ఫలితమేనన్నారు. ఈ సందర్భంగా అత్యధిక ఆదాయం సాధించిన కండక్టర్లు టీ.శివకుమార్, జీ. విజయ్‌బాబు, ఎస్‌కే కాలేషా, అత్యధిక ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లు సయ్యద్ షాజహాన్, కే. చెంచయ్యలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ బీ. మల్లికార్జున, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామక్రిష్ణ, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా పెన్షనర్ల ఆటల పోటీలు

కావలి(టౌన్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పెన్షనర్స్ డేని పురస్కరించుకుని కావలి తాలూకా పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియం మైదానంలో నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ ఆటల పోటీలను విశ్రాంత డైట్ అధ్యాపకుడు తూపిలి సుందరరామిరెడ్డి ప్రారంభించారు. ఆటల పోటీల్లో మహిళలు, పురుషులు వృద్ధాప్యాన్ని మరిచి గెలవాలన్న తపనతో పోటీ పడిన తీరు పలువురిని ఆకట్టుకుంది. షాట్‌పుట్, త్రోబాల్, డిస్కస్‌త్రో, క్యారమ్స్, చెస్ క్రీడాంశాల్లో 70 ఏళ్ల లోపు, పైబడిన వారికి రెండు విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈనెల 17న జరగనున్న ఆల్ ఇండియా పెన్షనర్స్ డే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందిస్తామని రమణయ్య తెలిపారు.


త్రోబాల్ వేస్తున్న పెన్షనర్

## నిర్ణీత సమయంలో బయోమెట్రిక్ వేయాలి

లింగసముద్రం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు నిర్ణీత సమయంలో ఉదయం 10.30 గంటలలోపు, సాయంత్ర 5గంటకు బయోమెట్రిక్ వేయాలని డీప్యూటీ ఎంపీడీవో ఎం.పూర్ణచంద్రరావు ఆదేశించారు. మంగళవారం ఆయన లింగసముద్రంలోని సచివాలయం1, 2, పెంట్రాల సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, కార్యాలయంలోని ఇతర రికార్డులను పరిశీలించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం సూచించిన అన్ని సర్వేలలో మండలం వెనుకబడి ఉందని, సర్వేలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

## గ్రామీణ రోడ్లకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

మామిడిపూడి రోడ్డు, రావిపాడు అప్రోచ్ రోడ్డు, కేయూఎస్ రోడ్డు - దేవిశెట్టిపల్లి రోడ్డు వయా అయ్యప్పవారిపాలెం, నేకునంపేట రోడ్డు - కొమ్ముపాలెం ఇస్కపాలెం రోడ్డు, డీకేడీ రోడ్డు - కొత్తపేట వయా నర్రవాడ రోడ్డు, తీర్థంపాడు రోడ్డు - సీసీ కండ్రిగ రోడ్డు, రాపూరు రాజంపేట రోడ్డు - కోత్తూరుపాడు రోడ్డు, పెంచలకోన ఆర్‌అండ్‌బీ రోడ్డు - ఎంజీపల్లి ఎస్టీ కాలనీ రోడ్డు.

● సంస్కృత వర్సిటీలో

# ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల అరెస్టు

● విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో పోలీసుల చర్య

● ఒడిశాలో బాధితురాలి వాంగ్మూలం రికార్డు



లక్ష్మణ కుమార్



ఎ.శేఖర్‌రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ లక్ష్మణకుమార్, డాక్టర్ శేఖర్‌రెడ్డిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తెలిపిన ప్రకారం.. ఒడిశాకు చెందిన విద్యార్థినిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణకుమార్ ఇటీవల తన ఆఫీసు గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే విభాగంలోని మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.శేఖర్‌రెడ్డి సంఘటనకు సంబంధించి ఫొటోలు, వీడియో తీసి ఆ విద్యార్థినిని బ్లాక్ మెయిల్ చేశాడు. దీనిపై వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ మురళీమోహన్ కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా డీఎస్పీ భక్తవత్సలంను ఎస్పీ సుబ్బరాయుడు నియమించారు. ఇక, వెస్ట్ సీఐ మురళీమోహన్, అలిపిరి ఎస్‌ఐ అజిత, మరో నలుగురు మహిళా కానిస్టేబుళ్ల బృందం రెండు రోజుల కిందట ఒడిశా వెళ్లి.. బాధితురాలి వాగ్మూలం రికార్డు చేశారు. మరోవైపు ఘటనా స్థలం పరిశీలన, సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలం ఆధారంగా కేసులో అదనంగా బీఎన్‌ఎస్ సెక్షన్లు 63,68 కింద చేర్చారు. మహిళల భద్రత, రక్షణ పట్ల జిల్లా పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని ఎస్పీ చెప్పారు.







# తిరుపతి - షిర్డీ వీక్లీ రైలు ప్రారంభం

తిరుపతి, సాయినగర్ షిర్డీ.. ఆధ్యాత్మిక క్షేత్రాల మధ్య అనుసంధానం పెరిగేలా, భక్తుల సౌకర్యార్థం వీక్లీ రైలును ప్రారంభించారు. ఢిల్లీ నుంచి మంగళవారం కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న వర్చువల్‌గా ప్రారంభించగా, తిరుపతి ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు. అదే సమయంలో తిరుపతిలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దనరెడ్డి, రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ సభ్యుడు జి.భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, తుడా మాజీ ఛైర్మన్ జి.నరసింహయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, రైల్వే సీఈ సూర్యనారాయణ, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, డిప్యూటీ సీఈ వామనమూర్తి, సీపీఆర్‌వో ఎ.శ్రీధర్, ఎస్‌ఎంఆర్ డాక్టర్ కె.చిన్నప రెడ్డి, ఐపీఎఫ్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రానికి ఎన్నో రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేస్తున్నామని, ప్రధానంగా విజయవాడ- గూడూరు మధ్య మూడో రైలు మార్గం పనులు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి సోమన్న వెల్లడించారు. తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు రూ.312 కోట్లతో జరుగుతున్నాయని రాష్ట్ర మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్/గూడూరు-రేణిగుంట మూడవ లైను, నడుకుడి-శ్రీకాళహస్తి రైలు మార్గాల పనులు జరుగుతున్నాయని వివరించారు.

- తిరుపతి(సెంట్రల్), ఆంధ్రజ్యోతి

# అయ్యో.. దేవుడా!

తడుకుపేట వద్ద ఢీకొన్న కార్లు

అక్కడికక్కడే ముగ్గురి దుర్మరణం

● మృతుల్లో ఇద్దరు తిరుచానూరు పోటు కార్మికులు.. మరొకరిది చెన్నై

● తిరుత్తణి నుంచి వస్తుండగా ప్రమాదం



ప్రమాదంలో నుజ్జయిన కార్లు





మృతులు శంకర సుబ్రహ్మణ్యం, సంతానం (ఫైల్ ఫొటోలు)

నగరి/తిరుచానూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి వారం లాగే ఈ మంగళవారమూ సుబ్రహ్మణ్య స్వామి దర్శనానికని తిరుత్తణికి బయలుదేరారు. చిత్తూరు జిల్లా నగరి మండలం తడుకుపేట వద్ద వీరి కారు.. ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొన్నాయి. రెండు కారుల్లోని ముగ్గురు దుర్మరణం చెందారు. మృతుల్లో ఇద్దరు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలోని పోటు కార్మికులు కాగా, మరొకరు చెన్నైవాసి. పోలీసుల కథనం మేరకు.. తిరుచానూరు సమాజం వీధికి చెందిన శంకర్ సుబ్రహ్మణ్యం(50) పద్మావతి అమ్మవారి ఆలయంలో రెగ్యులర్ పోటు వర్కరు. వసుంధర నగర్‌కు చెందిన ఎస్.సంతానం(38) ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ మంచి స్నేహితులు. ప్రతి మంగళవారం తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వెళ్లేవారు. ఈ క్రమంలోనే కారులో తిరుత్తణికి బయలుదేరారు. నగరి మండలం వీకేఆర్ పురం-తడుకుపేట మధ్య చెన్నై నుంచి తిరుమలకు వస్తోన్న కారును మితిమీరిన వేగంతో వీరి కారు ఢీకొంది. ఈ తీవ్రతకు తిరుచానూరు నుంచి వెళుతున్న కారు రోడ్డుకు అవతల ఉన్న లోతట్టు ప్రాంతంలో ఎగిరి పడిపోగా సంతానం, శంకర సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతిచెందారు. చెన్నై నుంచి వచ్చే కారు దెబ్బతిని రోడ్డుపైనే ఆగిపోగా.. అందులోని చెన్నై మేడంబాక్కం ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్(40) దుర్మరణం చెందారు. అరుణ్‌కుమార్ భార్య తమిళ సెల్వి(36), మేనల్లుడు మదన్(40), కుమారుడు యశ్వంత్(11) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పోలీసులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించాక చెన్నైలోని తాంబరం ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్పీ తుషార్ డూడి, డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ప్రమాద కారణాలను సీఐ మల్లికార్జునరావు, ఎస్‌ఐ నాయక్‌లను అడిగి తెలుసుకున్నారు. మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి కారణమని, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం తరువాత మృతదేహాలను బంధువులకు పోలీసులు అప్పగించారు. మంగళవారం సాయంత్రానికి సంతానం, శంకర సుబ్రహ్మణ్యం మృతదేహాలు తిరుచానూరుకు చేరుకోగా టీటీడీ అధికారులు, ఆలయ ఉద్యోగులు, స్థానికులు నివాళులర్పించారు. శంకర్‌కు ఇద్దరు కుమారులు.. సంతానంకు పాప, బాబు ఉన్నారు. ఈ రెండు కుటుంబాల్లో విషాదంనెలకొంది. ఈ ప్రమాదంపై రవాణాశాఖ మంత్రి రాంప్రసాదరెడ్డి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. పోటు కార్మికుల మృతి విషాదకరమని పేర్కొన్నారు. ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## జిల్లా అధికారులతో నేడు డిప్యూటీ సీఎం మాటా మంతి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి శాఖలో డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్‌అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. గ్రామ పంచాయతీల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ఫైళ్లకు మోక్షం కల్పించారు. గ్రేడ్ 4 కార్యదర్శి నుంచి డిప్యూటీ ఎంపీడీవోల వరకు పదోన్నతి కల్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్రంలోని జడ్పీ సీఈవోలు, డీపీవోలు, పీడీ డ్వామా, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డీడీవోలతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాటా మంతి నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్‌లో యాక్షన్‌ప్లాన్ అలాగే గ్రామాణాభివృద్ధికోసం అధికారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. దీనికోసం జిల్లా నుంచి డీపీవో సుశీలాదేవి, డిప్యూటీ ఎంపీడీవోలు, డీడీవోలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాలనుంచి సుమారు 70మంది మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లారు.

## డిగ్రీ పరీక్షల వాయిదాపై వదంతులు నమ్మకండి

● అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షల వాయిదాపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ఆ వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం సూచించారు. ఈ నెల 9 వ తేదీన జరగాల్సిన పరీక్ష 14 వ తేదీ నిర్వహిస్తామన్నారు. 10 నుంచీ జరగాల్సిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా చేపడతామన్నారు. పరీక్షల వాయిదాపై కొందరు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. పరీక్షల వాయిదాపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

# 20.30 గంటలు.. 203 కిలోమీటర్లు

● స్కేటింగ్‌లో అంధ విద్యార్థి రికార్డు

తిరుపతి(క్రీడలు)/వడమాలపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కంటి చూపులేదు. కానీ స్కేటింగ్‌లో అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. 20.30 గంటల్లో 203 కిలోమీటర్లు స్కేటింగ్ చేశాడు. సోమవారం ఉదయం చిత్తూరుజిల్లా నంగిలిలో మొదలైన స్కేటింగ్ యాత్ర.. గంటకు దాదాపు 15 కిలోమీటర్ల వేగంతో సాగింది. మధ్యలో మూడు సార్లు బ్రేక్ తీసుకున్నాడు. ఇలా మంగళవారం వేకువజామున 2.30 గంటలకు వడమాలపేట మండలంలోని ఎస్వీపురం టోల్ ప్లాజా గమ్యస్థానానికి హర్షవర్ధన్ చేరుకున్నాడు. మంగళవారం తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. హర్షవర్ధన్ యాత్రను ప్రత్యక్షంగా రికార్డుచేసిన న్యాయనిర్ణేతలు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఏపీ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి, జీనియస్ బుక్ ఆఫ్‌రికార్డ్ నుంచి శ్రీనివాసరావు, విశ్వచంద్రారెడ్డి, వజ్రవరల్డ్ రికార్డ్ నుంచి పి.హరిణి ద్వారా ఆ బాలుడికి పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. పలువురు దాతలు ఆర్థికసాయం అందించారు. మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కాపుకార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ, తిరుపతి, చిత్తూరు డీఎస్‌డీవోలు శశిధర్, ఉదయ్‌భాస్కర్, స్కేటింగ్ కోచ్‌లు ప్రతాప్, ప్రేమ్‌నాథ్, శాప్ కోచ్‌లు లక్ష్మీకరుణ, చక్రవర్తి, హిందూజ, వినోద్, నాగరాజు, గోపీ, సాయిసుమతి తదితరులు పాల్గొన్నారు.



పతకాలు, ధ్రువపత్రాలు అందుకుంటున్న హర్షవర్ధన్





వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువపత్రం

# విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అత్యాచారం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 16 ఏళ్ల విద్యార్థినిపై ర్యాపిడో ఆటో డ్రైవరు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. అనంతపురానికి చెందిన విద్యార్థిని తిరుపతిలోని ఓ ప్రైవేటు హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. ఇటీవల ఆమె హాస్టల్ మారారు. పుస్తకాలు, చిన్న చిన్న పాత్రలు తీసుకెళ్లేందుకు ర్యాపిడో ఆటో బుక్ చేశారు. ఆమె మొబైల్ నెంబరు కర్నూలుకు చెందిన ఆటో డ్రైవర్ సాయికుమార్ (ప్రస్తుతం తిరుపతిలో ఉన్నాడు) వద్ద సేవ్ అయింది. దీంతో అతడు ఆమెకు పలుమార్లు ఫోను చేశాడు. కొంత కాలంగా వీరి మధ్య పరిచయం పెరగింది. తనకు అత్యవసరమై ఆమె ఆటో డ్రైవర్‌ను డబ్బు అడిగింది. దీనిని అవకాశంగా తీసుకున్న ఆటో డ్రైవర్.. ఆమెను మభ్యపెట్టి తన గదికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈనెల 2న సాయంత్రం ఫోన్ చేసి పిలిపించాడు. ఆటోలో శివారు ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అతడి బెదిరింపులకు భయపడి ఆమె ఎవరికీ చెప్పలేదు. చివరకు తన స్నేహితురాలితో కలసి సోమవారం రాత్రి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద సాయికుమార్‌పై సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు. అతడి ఆటో నెంబరు కోసం ఆమె ఉన్న పాత, కొత్త హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ఎస్పీ సుబ్బరాయుడు మూడు బృందాలను నియమించారు.

## 25న 'సిరాయ్' విడుదల



విక్రమ్ ప్రభు

తిరుమల శ్రీవారిని తమిళనటుడు విక్రమ్ ప్రభు మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..తాను నటించిన 'సిరాయ్' చిత్రం ఈనెల 25న విడుదల కానున్న సందర్భంగా స్వామి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు. మంగళవారం ఇంకా పలువురు ప్రముఖులు దర్శనం చేసుకున్నారు. వారిలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు


- 8 దుంగలు, కారు స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట- రైల్వేకోడూరు రహదారిలోని టాస్క్‌ఫోర్సు పోలీసులు ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక కారును సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్‌ఐ వినోద్‌కుమార్, ఏఆర్‌ఎస్‌ఐ ఈశ్వరరెడ్డి బృందం మంగళవారం రేణిగుంట -రైల్వేకోడూరు రోడ్డులో ప్రకృతి బాట వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఉదయం 7గంటల సమయంలో వేగంగా వచ్చిన ఒక కారు టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించి కొద్దిదూరంలో ఆగింది. అనుమానం వచ్చిన టాస్క్‌ఫోర్సు సిబ్బంది కారును సమీపించారు. దీంతో కారులోని ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబండించి పట్టుకోగలిగారు. కారులోని 8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. కారును, దుంగలను, నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.13 కోట్లు**

**సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,142**

**తలనీలాలు సమర్పించినవారు: 26,619**






పెండ్లిమండపం వద్ద పొన్నాలమ్మ



భేరివారిమండపం.. ముత్యాలమ్మ



జయరామరావువీధి.. కావమ్మ



బ్రాహ్మణవీధి.. నల్లగంగమ్మ



సన్నిధివీధి.. అంకాలమ్మ



గాంధీవీధి.. అంకమ్మ



కొత్తపేట.. భువనేశ్వరి

- శ్రీకాళహస్తి ప్రత్యేకం

# నేడు ఏడుగంగల జాతర

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవతలకు ఏటి ఉత్సవాన్ని జాతర మహోత్సవంగా నిర్వహించడం మన సంప్రదాయంలో భాగం. తమను గంగమ్మతల్లి చల్లగా చూడాలన్న సంకల్పంతో జాతరను వైభవంగా నిర్వహిస్తారు. జిల్లా అంతటా వేసవిలోనే గంగ జాతరలు జరుగుతుంటాయి. అందునా ఒకే గంగమ్మను కొలువుదీర్చుతారు. కానీ, శ్రీకాళహస్తి ప్రత్యేకత ఏంటంటే.. ఒకే రోజు ఏడు గంగమ్మలను కొలువుదీర్చి జాతర నిర్వహించడం. డిసెంబరులో.. వణికించే చలికాలంలో జాతర నిర్వహిస్తారు. ఏడు గంగమ్మలైన అక్కాచెల్లెళ్లు శ్రీకాళహస్తిలో స్వయంభువుగా వెలిశారని పురాణోక్తి. వందలాది సంవత్సరాలుగా శ్రీకాళహస్తిలో ఏడుగంగల జాతర నిర్వహిస్తున్నారు. చారిత్రాత్మకంగా పరిశీలిస్తే జమిందారుల, సంస్థానాధీశుల సమయంలో శ్రీకాళహస్తి గ్రామానికి ఏడువైపులా గంగరాళ్లు (తెట్టురాళ్లు) ఏర్పాటు చేశారని పెద్దలు చెబుతారు. ఆయా గంగమ్మల వద్ద ఆయా ప్రాంతాల్లో ఏటా అమ్మవార్లను కొలువుదీర్చడం, ఒకేరోజు ఒకేసారి ఊరేగింపు, నిమజ్జనం జరగడం తరతరాలుగా వస్తోంది. అలాంటి ఏడు గంగల జాతర బుధవారం శ్రీకాళహస్తిలో వైభవంగా వైభవోపేతంగా జరగనుంది. మంగళవారం రాత్రి అమ్మవార్లకు ఏడుగంగమ్మల ఆలయం వద్ద పూజలు నిర్వహించాక ముసుగు తొలగిస్తారు. బుధవారం వేకువజామున భక్తులకు దర్శన భాగ్యం కల్పించాక పెండ్లి మండపం వరకు ఏడుగంగమ్మలను ఒకరి వెనుక ఒకరుగా ఊరేగింపుగా ఆయా ప్రాంతాలకు తీసుకొస్తారు. ఉదయం 9 గంటల నుంచి భక్తులు ఏడు గంగమ్మలకు మొక్కులు చెల్లించుకుంటారు. మళ్లీ రాత్రికి ఏడుగురు అమ్మవార్లను ముత్యాలమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి ఒక్కొక్కరిని వరుసగా ప్రత్యేక పూజలతో నిమజ్జనం చేయడంతో జాతర ముగుస్తుంది.

## స్క్రబ్‌టైఫస్ జ్వరాలపై ఆందోళన వద్దు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ జ్వరాలపై ఆందోళన వద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వ్యాధి నివారణ, చికిత్సపై ఆరోగ్యశాఖ అధికారులతో మంగళవారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. స్క్రబ్ టైఫస్ చిగ్గర్‌మైట్ అనే పురుగు ద్వారా వస్తుందని తెలిపారు. ఇది పొలాలు, గడ్డి ప్రాంతాలు, పశువుల పాక వంటి చోట్ల ఎక్కువగా వ్యాపిస్తుందన్నారు. కాటు వేసిన చోట నల్లమచ్చ ఉంటుందని, ఐదు రోజులకు మించి జ్వరం తలనొప్పి, ఒళ్లు నొప్పులుంటే చికిత్సలు పొందాలన్నారు. జిల్లాలో అనుమానిత కేసులు నమోదైన వెంటనే రాపిడ్ రెస్పాన్స్ టీం స్పందించి అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రాపిడ్‌టెస్టులు నిర్వహించి రక్త నమూనాలను సేకరించి నిర్ధారణ కోసం రుయా, స్విమ్స్‌కు పంపించాలని ఆదేశించారు. జిల్లాలో స్క్రబ్ టైఫస్‌వ్యాధి వ్యాప్తి నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆనంద్, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలిని కాపాడబోయి..

- నీట మునిగి ఆమెతో పాటూ ప్రాణాలు కోల్పోయాడు



మృతి చెందిన గుణశేఖర్ - అంకమ్మ

నారాయణవనం, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని కాపాడబోయి.. చివరకు ఆమెతో పాటు ఆ వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద ఘటన మంగళవారం నారాయణవనం మండలంలోని తిరువట్యం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నగరి మండలం గుండ్రాజుకుప్పానికి చెందిన గుణశేఖర్(42) తిరువట్యంలో తన బంధువు దహనక్రియలకు వచ్చారు. సాయంత్రం ఈయన ఇంటికి వెళ్తుండగా.. అదే సమయంలో తిరువట్యం కాజ్‌వే వద్ద నారాయణవనం రజక కాలనీకి చెందిన అంకమ్మ(72) దుస్తులు ఉతుకుతూ నీటిలో పడిపోయింది. దీనిని గమనించిన గుణశేఖర్ ఆమెను కాపాడేందుకు నదిలో దూకడంతో, ఊపిరాడక చనిపోయాడు. వృద్ధురాలూ మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

## ఆస్పత్రికి వెళ్తుండగా ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న ఆటో
- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు



లావణ్య (ఫైల్‌ఫొటో)

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే వెళ్తే డాక్టర్ దగ్గర ముందుగానే చూపించుకుని తిరిగొచ్చేయచ్చని, తరువాత పనులకు వెళ్లొచ్చని బయలుదేరిన దంపతులు ప్రమాదానికి గురయ్యారు. భార్య అక్కడిక్కడే మృతి చెందగా, భర్త తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటన కోట మండలం చిట్టేడు, కేశవరం గ్రామాల సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. కోట మండలం గూడలి అరుంధతీయవాడకు చెందిన ధనరాశి మల్లికార్జున్, లావణ్య దంపతులకు వివాహమై 13 సంవత్సరాలు అవుతోంది. వీరికి పిల్లలు లేకపోవడంతో గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయాన్నే డాక్టర్ దగ్గరకు వెళ్దామని మల్లికార్జున్, లావణ్య దంపతులు బైక్‌పై గూడూరుకు బయలుదేరారు. చిట్టేడు - కేశవరం గ్రామాల నడుమ వెళ్తుండగా గూడూరు నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో లావణ్య(28) అక్కడికక్కడే మృతి చెందింది. మల్లికార్జున్ నడుం, భుజం, తలకు బలమైన గాయాలయ్యాయి. ఆటో నడుపుతున్న గూడూరుకు చెందిన అబ్బాస్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్‌ఐ పవన్‌కుమార్ సంఘటనాస్థలికి చేరుకున్నారు. రోడ్డుపై ఉన్న లావణ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మల్లికార్జున్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన మల్లికార్జున్

## ముంపు బాధితులను ఆదుకుంటాం: కలెక్టర్

కేవీబీపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కళత్తూరు చెరువు ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. కళత్తూరులో ముంపు బాధితులకు రూ.1.21 కోట్లు, రూ.42,20,000 కు సంబంధించి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధితులకు మైక్ అందించి ప్రభుత్వం నుంచి ఏం కోరుకుంటున్నారో చెప్పాలన్నారు. తమకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న మురుగు వ్యవస్థను బాగు చేయించాలని, సిమెంటు రోడ్డు నిర్మించాలని, సిలిండర్లను పంపిణీ చేయాలని కోరారు. అన్నిటికంటే ముందు రాయలచెరువు కట్ట పటిష్ఠం చేయాలని, పాఠశాల భవనాలను బాగు చేయించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 625 పశువులు మృతి చెందగా గేదెకు రూ.50వేలు, ఆవుకు రూ.40వేలు, గొర్రెలు, మేకలకు రూ.7,500, కోళ్లకు రూ.100 చొప్పున పరిహారం అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి రూ.10వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని బాధితుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఇప్పటికే రూ.4 కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. రుణాల విషయంలో బ్యాంకర్లతో మాట్లాడి మహిళలకు ప్రత్యేక సహాయనిధిని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. పొలాల్లో ఇసుక, మట్టి మేటలుంటే హెక్టార్‌కు రూ.18వేలు, కోతకు గురైతే ఎకరాకు రూ.18వేలను త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు పోగొట్టుకున్నవారికి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి అందిస్తామన్నారు. విద్యార్థులు తాము చదువుకున్న విద్యా సంస్థల వివరాలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, గోవర్ధన్, సాదు, థామస్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, తహసీల్దారు రోశయ్య, ఎంపీడీవో మాలతి, ఏవో సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పశవులు, గొర్రెలు, మేకలు కోల్పోయిన వారికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్

## ప్రజల ఆకాంక్షను గుర్తించండి



టవర్‌క్లాక్ వద్ద దీక్షలో జేఏసీ నాయకులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గూడూరు ప్రజల ఆకాంక్షను గుర్తించి నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి అన్నారు. పట్టణంలో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద చేపట్టిన రిలే దీక్ష మంగళవారం నాటికి మూడో రోజుకు చేరింది. ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లు, ఆటో కార్మికులు, బీజేపీ నాయకులు దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు, ఉద్యోగులు వ్యయప్రయాసలకు గురవుతున్నారని చెప్పారు. గూడూరుకు దగ్గరగా ఉండే నెల్లూరే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలను కోరారు. ఇదే డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నలుగురి అరెస్టు



నిందితులను మీడియా ముందు చూపుతున్న సీఐ మురళి

వరదయ్యపాళెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం లక్ష్మీపురంలో ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను మంగళవారం ఉదయం మీడియాకు సీఐ మురళి వెల్లడించారు. ఆ ప్రకారం.. సీఎల్ఎన్ పల్లె మిట్ట హరిజనవాడలో గతనెల 30న గ్రామానికి చెందిన వంటమాస్టర్ హరి(33)ని దుండగులు హత్య చేసి పాడుబడిన ఇంట్లో పడేసి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మల్లికార్జున్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. చెన్నై నుంచి అన్నదమ్ములు గౌతమ్, ప్రేమ్‌కుమార్ గ్రామంలో వచ్చి నివాసం ఉంటున్నారు. వారితో హరితో స్నేహంగా ఉండేవారు. గౌతమ్ స్థానికంగా ఏసీ పరిశ్రమలో పని చేస్తుండగా, ప్రేమ్‌కుమార్ జులాయిగా తిరిగేవాడు. ముగ్గురూ కలిసి మద్యం తాగేవారు. ఈ క్రమంలో మద్యం మత్తులో జరిగిన గొడవలో గౌతమ్, ప్రేమ్‌కుమార్ కలిసి హరిపై దాడి చేశారు. గమనించిన హరి బంధువులు, గ్రామస్తులు గౌతమ్, ప్రేమ్‌కుమార్‌ను హెచ్చరించారు. ఎక్కడినుంచో వచ్చి తమ గ్రామానికి చెందిన వ్యక్తిని ఎలా కొడతారంటూ తిట్టి పంపించారు. మీరేం చేయలేరంటూ హరి వారికి సవాల్ విసిరాడు. దీంతో అహం దెబ్బతిన్న గౌతమ్, ప్రేమ్‌కుమార్.. హరిని కడతేర్చాలని పథకం పన్నారు. కొద్ది రోజుల తరువాత హరితో ఎప్పటి లాగే సఖ్యంగా మెలిగారు. రోజూ హరికి మద్యం తాగించేవారు. గత నెల 30వ తేదీ హరి భార్య దేవసేన ఊరికి వెళ్లడంతో ఇదే సరైన సమయమని భావించిన గౌతమ్, ప్రేమ్‌కుమార్... హరిని తమ ఇంటికి తీసుకెళ్లి ఫుల్‌గా మద్యం తాగించారు. అప్పటికే తమ ఇంట్లో హత్య కోసం చెన్నై నుంచి పిలిపించుకున్న మరో ఇద్దరు స్నేహితుల సహకారంతో గౌతమ్, ప్రేమ్‌కుమార్‌లు హరిని ఐరన్‌రాడ్, బండరాయితో హత్య చేశారు. హరి మృతి చెందాడని నిర్ధారించుకున్న తరువాత హత్యకు ఉపయోగించిన బండరాయిని, మృతుడిపై ఉన్న మరకలను శుభ్రంగా కడిగి, సమీపంలోని పాడుబడిన ఇంట్లో మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్‌ను, తాము ధరించిన దుస్తులను కాల్చి ఉబ్బలమడుగు సమీపంలోని నీటి కాలువలో కలిపేశారు. మృతుడి భార్య దేవసేన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఉబ్బలమడుగు క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులో తీసుకుని విచారణ చేయడంతో హత్యను చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. గౌతమ్, ప్రేమ్‌కుమార్‌తో పాటు చెన్నై థౌజండ్‌లైట్స్‌కి చెందిన జాన్‌పాల్ అలియాస్ జాన్, ఊటీకి చెందిన బెంజమిన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్, బండరాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ మల్లికార్జున్, సత్యవేడు రెండో ఎస్‌ఐ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు స్థిరమైన ఉపాధి

- మంత్రి లోకేశ్ నిరంతర కృషి
- అమెరికా పర్యటన సత్ఫలితాలిస్తోందన్న భానుప్రకాష్



మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన సత్ఫలితాలనిస్తోందన్నారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే భాను కూడా ఉన్నారు. ఏపీని పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా పరిచయం చేస్తూ లోకేశ్ ప్రముఖ సంస్థలతో పలు కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సెమీకండక్టర్, కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆయా ప్రముఖ సంస్థలను లోకేశ్ ఆహ్వానించినట్లు వివరించారు. రాష్ట్ర ఆర్థిక బలోపేతం, పరిశ్రమల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలే అమెరికా పర్యటన ప్రధాన ఉద్దేశమన్నారు.

- పొగాకు పొడి చల్లి నగ లాక్కెళ్లిన

## ఆటో డ్రైవర్ సహా ముగ్గురి అరెస్టు

- బంగారు గొలుసు, కత్తులు, ఆటో స్వాధీనం





నిందితుల అరెస్టును చూపుతున్న తిరుపతి రూరల్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో ఆదివారం సాయంత్రం పొగాకు పొడి చల్లి, కొట్టి మహిళ మెడలో బంగారు నగ లాక్కెళ్లిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. రైల్వే కోడూరులోని శ్రీరామ్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కస్తూరి జయకృష్ణ, అదే ప్రాంతానికి చెందిన మాచినేని శిరీష, అన్నమయ్య జిల్లా రాజంపేట తాలూకా కొట్లపల్లికి చెందిన లింగుట్ల వెన్నెల మిత్రులు. వీరు చిన్నప్పటి నుంచి జులాయిగా తిరిగేవారు. చిన్న దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో తిరుపతి వ్యవసాయ కళాశాలలో అటెండరుగా పనిచేస్తున్న మల్లిక డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లడానికి రోడ్డుపై నిలబడి ఉన్నారు. ఇంతలో పెరుమాళ్లపల్లి వైపు వెళుతున్న ఆటో వచ్చింది. ఆటోలో అప్పటికే ఇద్దరు మహిళలు ఉండటంతో ఆమె ధైర్యంగా ఎక్కారు. పథకం ప్రకారం ఆ ఇద్దరు మహిళలు ఆటో డ్రైవర్ సహాయంతో మల్లిక కళ్లలో పొగాకు పొడి చల్లి తలపై రాడ్డుతో కొట్టారు. ఆమె మెడలో వున్న బంగారు చైను లాక్కొని ఆటో నుంచి కిందకు తోసేసి పరారయ్యారు. దాడిలో బాధితురాలికి తలపై బలమైన గాయం కావడం, శరీరమంతా చిన్నపాటి దెబ్బలు తగలడంతో స్థానికులు రుయాలో చేర్పించారు. ఈ ఘటన జరిగిన వెంటనే ఎస్పీ సుబ్బరాయుడు స్పందించి చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు వాడుతున్న మొబైల్ ఫోన్ల ఆధారంగా వాళ్లున్న ప్రాంతాన్ని గుర్తించారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా చెర్లోపల్లి జంక్షన్ వద్ద అయాన్ డిజిటల్ సమీపంలో నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి 24 గ్రాముల బంగారు చైను, దోపిడీకి ఉపయోగించిన కత్తులు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని అత్యంత వేగంగా ఛేదించిన పోలీసు బృందాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## తిరుమలలో దుకాణాల పరిశీలన

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యురాలు అనుగోలు రంగశ్రీ మంగళవారం తిరుమలలోని దుకాణాలను పరిశీలించారు. ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలిసి ఆమె తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లారు. అక్కడి దుకాణాల లైసెన్సులను స్వయంగా పరిశీలించారు. అనధికారికంగా ఎవరైనా దుకాణాలు నిర్వహిస్తున్నారా అని తనిఖీ చేశారు. అలాగే హాకర్ లైసెన్సులను కూడా చూశారు. టీటీడీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పలువురు దుకాణదారులకు సూచనలు చేశారు.



లైసెన్సులు పరిశీలిస్తున్న రంగశ్రీ

## డివైడర్ ఢీకొన్న ఆటో

- తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు





గాయపడ్డ మహమ్మద్ అలీ, రహమాన్

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లి వద్ద మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. తిరుపతికి చెందిన మహమ్మద్ అలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీకాళహస్తిలో ఏడుగంగల జాతర కోసం తిరుపతి నుంచి పూలమాలలను తీసుకుని ఆటోలో కొడుకు అబ్దుల్ రహమాన్‌తో పాటు బయలుదేరారు. నాయుడుపేట- రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి పట్టణంలోకి వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు ఆరంభమయ్యే చోట ఆటో అదుపుతప్పి డివైడర్ను ఢీకొంది. ఈ ఘటనలో వీరిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం క్షతగాత్రులను తిరుపతి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

## హెల్మెట్ లేకుండా రోడ్డెక్కం



ద్విచక్ర వాహనదారుల చేత ప్రమాణం చేయిస్తున్న ఎస్ఐ శివశంకర్

డక్కిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇకపై హెల్మెట్ ధరించే ద్విచక్ర వాహనాలను నడుపుతామని పలువురి చేత ఎస్ఐ శివశంకర్ ప్రమాణం చేయించారు. మంగళవారం రాపూరు - వెంకటగిరి జాతీయ రహదారిపై మార్లగుంట వద్ద ఎస్ఐ శివశంకర్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న యువకులకు అవగాహన కల్పించారు. ఇకపై హెల్మెట్ ధరించకుండా రోడ్డెక్కబోమని ప్రమాణం చేయించారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాలకు వెళ్లి హెల్మెట్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి కింద తొలగని నీరు

### దారి లేక మినమనమూడి గ్రామస్తుల అవస్థలు



దొరవారిసత్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం మినమనమూడి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు చేరడంతో గ్రామస్తులు దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారి నుంచి మినమనమూడి గ్రామానికి వెళ్లే దారిలో రైల్వే గేట్‌ను తొలగించి అండర్ బ్రిడ్జి నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జి నీరు చేరింది. సమీపంలోనే రెండు రెండు పంట కాలువలు ఉండటంతో ఊట ఊరుతూ బ్రిడ్జి కింద నీరు తగ్గడంలేదు. దీంతో మినమనమూడి గ్రామానికి రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. రైల్వే అధికారులు స్పందించి అండర్ బ్రిడ్జి కింద నీటిని తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## అందరికీ యూరియా ఇవ్వండి

### దామానెల్లూరు సొసైటీ సీఈవోతో రైతుల వాగ్వాదం



దామానెల్లూరు సొసైటీ వద్ద రైతులు

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో వివక్ష లేకుండా అందరికీ అందజేయాలని రైతులు కోరారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మంగళంపాడు, దామానెల్లూరు, రాచంద్రగుంట, ఉగ్గుముడి, మతకాముడి, వెలగలపొన్నూరు గ్రామాలకు చెందిన రైతులు యూరియా తీసుకునేందుకు దామానెల్లూరు సొసైటీ కార్యాలయానికి వచ్చారు. తొలి విడత పంటలు వేసే రైతులకు ముందుగా ఇస్తామని, మంగళంపాడు గ్రామ రైతులకు తరువాత ఇస్తామని అక్కడున్న నాయకులు చెప్పడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీలో పాలకవర్గం కాకుండా సంబంధం లేని నాయకులు యూరియా పంపిణీ విషయంలో జోక్యం చేసుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదంటూ సీఈవో రామయ్యతో వాగ్వాదానికి దిగారు. దీంతో సొసైటీ సిబ్బంది యూరియా పంపిణీని నిలిపివేశారు. సమాచారం తెలుసుకున్న వ్యవసాయాధికారిని కాంచన అక్కడకు చేరుకుని రైతులకు నచ్చచెప్పి ఉన్న అవసరమైన రైతులకు యూరియాను అందజేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

## బాల్య వివాహాలతో అనర్థాలు

నాయుడుపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల అనర్థాలు జరుగుతాయని నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ విజయకుమార్ అన్నారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డీఆర్ వాసప్ప, ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహులు ఆధ్వర్యంలో తాళ్వాయిపాడు గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. శారీరకంగా, మానసికంగా ఎదగని వయస్సులో వివాహాలు చేస్తే శారీరక రుగ్మతలు వస్తాయని చెప్పారు. అనంతరం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి అ వగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్పన, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి యాదవ్, శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, వీరాస్వామి, ఎన్‌సీసీ కెప్టెన్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి క్రిస్టి మనోహర్



నాయుడుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు నాయుడుపేట క్రీడాకారుడు క్రిస్టి మనోహర్ ఎంపికైనట్లు కోచ్ గౌస్‌బాషా తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో పల్నాడు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో నాయుడుపేట బేరిపేటకు చెందిన క్రిస్టి మనోహర్ ప్రతిభ చూపి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. జనవరి 11 నుంచి హర్యానా రాష్ట్రం పానిపట్టు జిల్లాలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో క్రిస్టి మనోహర్ పాల్గొంటాడని చెప్పారు.

## ఇంధన పొదుపుపై విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మృదుల, పక్కన డీఈఈ శేఖర్ తదితరులు

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంధన పొదుపుపై క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. విద్యుత్‌శాఖ డీఈఈ శేఖర్ ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లోని 9, 10 తరగ తుల విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు మృదుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

### డిగ్రీ కళాశాలలో...

నాయుడుపేట టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంధన పొదుపు ఆవశ్యకత తెలిపేందుకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీఈ వరప్రసాదరెడ్డి, ఏఈలు శివశంకర్, హరికృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

## నేడు డక్కిలిలో ప్రజాదర్బార్

డక్కిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్‌కు సన్మానం

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్‌ను సూళ్లూరుపేట పట్టణ జనసేన అధ్యక్షుడు పొన్నా కాటయ్య, టీడీపీ నాయకులు వేనాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రాఘవేంద్ర, సీతారాముల దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కారంశెట్టి మల్లికార్జునశర్మ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్‌ను పూలమాలవేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.



సాయిప్రసాద్‌ను సన్మానిస్తున్న కాటయ్య, ప్రవీణ్‌రెడ్డి తదితరులు





మగ్గం గుంటలోకి చేరిన నీరు - వర్షాలకు పాడైన పట్టు, పడుగు. జరీ వస్తువులు

# ఆపన్న హస్తం కోసం నేతన్నల ఎదురుచూపులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. మగ్గం గుంటలల్లోకి నీరు చేరడంతో పట్టు, పడుగు, జరీ వంటి వస్తువులు పూర్తిగా తడిచిపోయి పనికిరాకుండా పోయాయని నేతన్నలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్న నేత కార్మికులకు దిత్వా తుఫాను కారణంగా కురిసిన వర్షాలు మరింత నష్టం మిగిల్చాయి. గూడూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో సుమారు 250కు పైగా చేనేత కుటుంబాలు ఉన్నాయి. అక్టోబరులో మొంథా, ఈ నెలలో దిత్వా తుఫాన్ల కారణంగా భారీ వర్షాలు కురవడంతో మగ్గం గుంటల్లోకి నీరు చేరింది. పట్టు, నూలు, పడుగు, జరీ వంటి వస్తువులు పూర్తిగా తడిచిపోయి పనికిరాకుండా పోవడంతో ఒక్కో చేనేత కార్మికుడికి సుమారు రూ.10 వేల నుంచి రూ.12 వేలకు నష్టం వాటినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా రెండు నెలలుగా పనులు లేక పోవడంతో జీవనోపాధి లేకుండా పోయి పూట గడవడమే ఇబ్బందికరంగా మారిందని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేసిందన్నారు. చెన్నూరులో ఇప్పటి వరకు ఏమీ ఇవ్వలేదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి తడిచిపోయిన పట్టు, పడుగు వస్తువుల నష్టాన్ని అంచనా వేసి సాయం అందించడంతో పాటు బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేయాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.



పాడైపోయిన నూలు కండెలను చూపుతున్న చేనేత కార్మికులు

# ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం: కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. మంగళవారం ఆయన బంగారుపేట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఓపీ, మందుల గది, రక్త పరీక్షల విభాగంతో పాటు ప్రసూతి వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో వసతులు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు రెండు నెలలకోసారి ప్రభుత్వాస్పత్రులను సందర్శించి వైద్య సేవల నాణ్యతను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

**బాలాయపల్లి:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ సంఖ్య, మందుల కొరత, ఇతర సమస్యలపై ఆరా తీశారు. సిబ్బంది కొరత ఉందని, వర్షం కురిస్తే ప్రసూతి గది ఉరుస్తుందని వైద్యాధికారి లిఖిత వివరించారు. ఎమ్మెల్యే ప్రసూతి గదిని పరిశీలించారు. ఆస్పత్రిలో అదనపు భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. సిబ్బంది కొరత గురించి డీఎం అండ్ హెచ్‌వోతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండలాధ్యక్షుడు రాయి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, యాచవరం సొసైటీ అధ్యక్షుడు సీనీ నాయుడు, నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడు ఆది వెంకటకృష్ణారెడ్డి ఉన్నారు.



బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్యురాలితో మాట్లాడి ఆస్పత్రిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. నాయుడుపేట సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ గడియారం సెంటర్ వద్ద పోలేరమ్మ ఆలయం ఎదుటు ఇనుప టేబుల్‌ను ఢీకొన్న సంగతి తెలిసిందే. ఆ బస్సును సీజ్ చేయడంతో పాటు డ్రైవర్ షేక్ హుమయూన్, పాఠశాల వాహనాల ఇన్‌చార్జి సుధీర్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పాఠశాల యాజమాన్యంపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## శ్రీపురం రోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లు

డక్కిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - శ్రీపురం తారురోడ్డు నిర్మాణానికి సాస్కీ పథకం ద్వారా రూ.1.30 కోట్లు నిధులు మంజూరైనట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి తెలిపారు.

## వైద్యఖర్చులకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీఎస్ రోడ్డు ప్రాంతానికి చెందిన సాయిరాం కాలేయ, మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం బాలాజీ నగర్‌లోని ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, కుమార్, పెంచలయ్య, కృష్ణారెడ్డి, వెంకట్రావు, విజయ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న జేవీవీ నాయకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో మనపాటి శ్రీనివాసరావు దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చలపతి, నాగరాజు, రామ్మోహన్‌రావు, పురుషోత్తమరావు, పవన్, సుబ్బారావు, ప్రభాకర్, రజనీకాంత్, అశోక్, సురేష్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎల్‌డీవో జాలిరెడ్డి చేతుల మీదుగా దివ్యాంగులకు దుస్తులు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ కార్యదర్శి ఆదిశేషారెడ్డి, అధ్యక్షురాలు లలిత, ఎంపీడీవో మురళీకృష్ణ, దివ్యాంగుల నాయకురాలు నాదెండ్ల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

## మన్నారుపోలూరులో ఉచిత వైద్య శిబిరం

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు సచివాలయ ఆవరణలో మంగళవారం నెల్లూరు నారాయణ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కీళ్లు, ఎముకలు, చర్మ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్థానికులు పాముూరు మునస్వామి, ఆవుల శ్రీనివాసులు, బండ్ల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం కండి



టీడీపీ నాయకులతో సమావేశమైన పార్టీ పరిశీలకులు

డక్కిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థ ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సంసిద్ధులు కావాలని పార్టీ పరిశీలకులు దాసరి అంకయ్య, పాలేటి అంకయ్య కోరారు. మంగళవారం డక్కిలి, వెంబులూరు, సంగనపల్లిలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి దుగ్గి వెంకటేశ్వర్లు నాయుడు, నాయకులు పోకూరు రమేష్ నాయుడు, పాయసం గోపాల్, చెంచయ్య యాదవ్, సర్వేపల్లి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక నిప్పో పరిశ్రమ సమీపంలో చెన్నై వెళ్లే జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి నడుచుకొని వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎటువంటి ఆధారాలు లభ్యంకాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

## ఘనంగా ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం

తడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తడకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈవోలు వేములు, మల్లికార్జునరావు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హరిత, జనవిజ్ఞానవేదిక నాయకులు చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంఈవో సునీలా అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మన్నారుపోలూరు ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి చైతన్య, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, స్వరూప, సుమల, హరి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో సునీల, పక్కన ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్నవారితో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో 63 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ రూ.42.71 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే విజయశ్రీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయుడుపేట, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్లు ఉయ్యాల ప్రవీణ్, ఆకుతోట రమేష్, నాయకులు కందల కృష్ణారెడ్డి, రఫీ,అశోక్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, నిత్యకృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, సుబ్బారావు, మైలారి రాజశేఖర్, పొట్లపూడి రాజేష్, అవధానం సుధీర్, విజయకుమార్ నాయుడు, అంకయ్య, జీవీఆర్ నాయుడు, అన్నమనేని సాయి తదితరులు పాల్గొన్నారు.

## పంటల సస్యరక్షణపై దృష్టి పెట్టండి



కేశవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సుచేంద్ర ప్రసాద్

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో రైతులు పంటల సస్యరక్షణపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని కేశవరం, చిట్టేడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కేశవరం, రాఘవాపురం, సిద్ధమ్మకండ్రిగ, చిట్టేడు గ్రామాల్లో ఏవో సుచేంద్రప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్ రైతులతో పైర్లను పరిశీలించారు. వరి పొట్ట, చిరుపొట్ట దశలోకి వచ్చే అవకాశం ఉన్నందున చీడపీడల నివారణపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు పంటల పరిస్థితిని వివరిస్తూ వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు.

## ఏకలవ్య మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్‌ను డిస్మిస్ చేయాలి

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులను విచక్షణా రహితంగా చితకబాదిన ఓజిలిలోని ఏకలవ్య మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేశారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకేశ్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల మానవ మృగంలా ప్రవర్తించిన వైస్ ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు నాగరాజు, ప్రసాద్, చంద్ర, కార్తీక్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లాలో గూడూరును కలిపేలా చర్యలు తీసుకోండి



ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని గత వైసీపీ ప్రభుత్వం తిరుపతి జిల్లాలో కలపడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. తిరుపతి చాలా దూరంగా ఉండడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే దూరం కావడంతో ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో పనబాక కోటేశ్వరరావు, ఆరికట్ల బాలకృష్ణ మనాయుడు, దయాకర్, గిరిధర్‌రెడ్డి, బాలకృష్ణ, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### వాకాడులో తహసీల్దారుకు వినతిపత్రం...

వాకాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో గూడూరు నియోజకవర్గాన్ని కలపాలని కోరుతూ బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబరు పామంజి కృష్ణయ్య, సీనియర్ నాయకులు పాదర్తి కోటారెడ్డి, మండల అధ్యక్షుడు తూపిలి చంద్రారెడ్డి తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్‌కు వినతిపత్రం అందజేశారు. గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల కలిగే నష్టాలను తహసీల్దారుకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ గూడూరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఇదే డిమాండ్‌తో వాకాడు మండలంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపడతామని చెప్పారు.